# తొలివెలుగు

TGTEL/26/A6221

TOLE VELUGGU JATIYAPATRIKA

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం　　జాతీయ పత్రిక

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 13 | సోమవారం | 10-8-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/- |
|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:13 | Monday | 10-8-2026 | Pages:08 | Cost:2/- |







# ఆదివాసీ గిరులు.. అవకాశాల గనులు



- ఆదివాసీలతో కలిసి డప్పు కొట్టిన చంద్రబాబు..
- ఉత్సాహంగా ధింసా స్టెప్పులేసిన సీఎం
- అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- గిరిజన మహిళలతో కలిసి ధింసా నృత్యం, డప్పు కొట్టి అలరించిన సీఎం
- దేశానికి ఉన్నట్టే ప్రతి పౌరుడికీ వ్యక్తిగత విజన్ ఉండాలని పిలుపు
- 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనే తన సంకల్పమని స్పష్టం చేసిన చంద్రబాబు
- నిబద్ధతతో పనిచేయడమే నిజమైన దేశభక్తి అని ఉద్ఘాటన

గిరిజనులు ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు కారని.. వారంతా అభివృద్ధి భాగస్వాములని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆదివాసీ ప్రాంతాలు వెనకబడినవి కావని, అపారమైన అవకాశాలు ఉన్న ప్రదేశాలని తెలిపారు. విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో ఆదివారం జరిగిన అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవానికి సీఎం హాజరయ్యారు. ఆయనకు గిరిజన మహిళలు, విద్యార్థులు ధింసా నృత్యాలతో స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో చంద్రబాబు మాట్లాడారు. గిరిజనులు ప్రకృతిని దేవతగా, అడవిని అమ్మగా ఆరాధించి సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుంటున్నారని కొనియాడారు. వారు స్వచ్ఛమైన మనుషులని.. వారికి చేయూతనిచ్చి, చైతన్యం తీసుకురావాలని పిలుపిచ్చారు. రాష్ట్రంలోని 27.39 లక్షల మంది గిరిజన జనాభా సంక్షేమం కోసం ఈ ఏడాది రూ.4,764 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. 'ప్రణాళికాబద్ధంగా పనిచేస్తే గిరిజనులను అభివృద్ధిలోకి

2లో



# బోనమెత్తిన పాతబస్తీ

- కన్నుల పండువగా లాల్‌దర్వాజా బోనాలు
- మొదటి బోనం సమర్పించిన దేవేందర్ గౌడ్ కుటుంబం
- పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్,పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్
- బంగారు బోనమెత్తిన కొండా సురేఖ.. అలరించిన పోతరాజులు

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి 118వ బోనాల జాతర ఉత్సవాలు ఆదివారం కనుల పండువగా కొనసాగాయి. మహిళా భక్తులు సంప్రదాయ వస్త్రధారణతో బోనాలను తీసుకురాగా....యువకులు పోతరాజు వేషధారణలో భక్తులను విశేషంగా అలరించారు. శివసత్తుల చిందులతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. జోగినీలు మెట్ల బోనాలతో నృత్యాలు చేస్తూ ముందుకు కదిలారు. తెల్లవారుజామున 3 గంటలకు జల్లి కదువా, 4 గంటలకు బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 5.30 గంటలకు మాజీ

## హర్మూజ్ జలసంధిపై వీడని ఉత్కంఠ..

- అమెరికా, ఇరాన్‌ల పరస్పర విరుద్ధ ప్రకటనలు
- ఇరాన్‌తో పాక్షికంగానే చర్చలు జరుపుతున్నామన్న ట్రంప్
- సైనిక చర్యకు బదులు ఆర్థిక ఒత్తిడి పెంచడానికే మొగ్గుచూపుతున్నామని వెల్లడి
- అమెరికాతో ఎలాంటి చర్చలు జరగడం లేదని మరోసారి స్పష్టం చేసిన ఇరాన్
- హర్మూజ్‌లో తాత్కాలిక మార్గంపై ఒమన్‌తో ఒప్పందానికి దగ్గరగా ఉన్నామని ప్రకటన

ఇరాన్‌తో తాము 'పాక్షికంగానే చర్చలు' జరుపుతున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై కొత్తగా సైనిక చర్యకు ఆదేశించే బదులు, ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచడానికే తాను సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. యాక్సియోస్ వార్తా సంస్థతో ఫోన్‌లో మాట్లాడిన ట్రంప్, ఈ విషయాన్ని తాము పెద్దదిగా చేయడం లేదని అన్నారు. ఆర్థికంగా ఇరాన్ చాలా బలహీనమైన స్థితిలో ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా, హర్మూజ్



2లో

## పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి కేసీఆర్ పరామర్శ..

- రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందజేత
- నల్లబెల్లిలో దివంగత ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ
- హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించిన కేసీఆర్
- రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం చెక్కులు అందజేత
- సుదర్శన్‌రెడ్డితో అనుబంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగం
- పార్టీ అండగా ఉంటుందని కుటుంబానికి భరోసాం

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్ జిల్లా నల్లబెల్లిలో పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



2లో

## డాక్టర్ ప్రియాంక మృతి బాధాకరం.. నిందితులకు కఠిన శిక్ష తప్పదు

- హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ డాక్టర్ ప్రియాంక మృతి
- మద్యం మత్తులో యువకులు నడిపిన కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు
- ప్రియాంక మృతి ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ తీవ్ర దిగ్భ్రాంతి
- నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూస్తామన్న పవన్
- మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా



రాజమహేంద్రవరంలో కొద్దిరోజుల ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ ప్రియాంక, హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. మద్యం మత్తులో కొందరు యువకులు మితిమీరిన వేగంతో, అత్యంత నిర్లక్ష్యంగా కారు నడిపి ఆమెను ఢీకొట్టడంతో ఈ ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. భవిష్యత్తులో వైద్యురాలిగా సమాజానికి ఎంతో సేవ చేయాల్సిన ప్రియాంక అకాల మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కార్యాలయం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.

మిగతా 2లో




## రాజమండ్రి ప్రమాద ఘటనలో గాయపడిన ప్రియాంక మృతి

- రాజమండ్రి రోడ్డు ప్రమాద బాధితురాలు, మెడికో ప్రియాంక చికిత్స పొందుతూ కన్నుమూత
- సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచిన వైనం
- మరణాన్ని ధ్రువీకరించిన వైద్యులు
- ప్రమాదానికి కారణమైన ఇద్దరు నిందితులు ఇప్పటికే అరెస్ట్

2లో

## ప్రతిష్టంభనకు తెరపడేనా?

- పార్లమెంట్ వర్షాకాల సెషన్‌లో మిగిలింది నాలుగు రోజులే
- 15 రోజుల్లో లోక్‌సభ పనిచేసింది 15.36 గంటలు మాత్రమే
- ప్రతిపక్షాల పట్టుతో సందిగ్ధంలో ఎఫ్‌సీఆర్‌ఏ సహా కీలక బిల్లులు





## ఇవాళ జరిగిన దాడిలో చనిపోయి ఉండేదాన్ని

- పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ కారుపై రాళ్ల దాడి
- మృతి చెందిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లగా ఘటన
- పోలీసుల సమక్షంలోనే దాడి జరిగిందని మమత ఆరోపణ
- దాడిని ఖండించిన బీజేపీ, తమకు సంబంధం లేదని వెల్లడి
- కస్టడీ మరణాన్ని రాజకీయం చేస్తున్నారంటూ మమతపై సువేందు అధికారి విమర్శ

## డాక్టర్ ప్రియాంక మృతి బాధాకరం.. నిందితులకు కఠిన శిక్ష తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

ఈ హృదయవిదారక ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. "డాక్టర్ ప్రియాంక మృతి వార్త నన్ను తీవ్రంగా కలచివేసింది. ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్న నిందితులకు కఠిన శిక్షలు పడేలా కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది" అని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విపత్కర సమయంలో ప్రియాంక కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ ప్రమాదానికి బాధ్యులైన వారు ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని, వారిని కఠినంగా శిక్షిస్తామని ప్రభుత్వం తరపున హామీ ఇచ్చారు.

## బోనమెత్తిన పాతబస్తీ


(మొదటి పేజీ తరువాయి)

మంత్రి టి.దేవేందర్ గౌడ్ తనయుడు వీరేందర్ గౌడ్ దంపతులు అమ్మవారికి దేవి మహాభిషేకాన్ని నిర్వహించి మొదటి బోనం సమర్పించారు. ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన బోనాల సమర్పణ సాయంత్రం వరకు కొనసాగింది. బోనాలతో పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌లు పట్టు వస్త్రాలు సమర్పించగా, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బంగారు బోనం సమర్పించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, దానం నాగేందర్, పైడి రాకేష్ రెడ్డి, రాజ్ ఠాకూర్, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆల, సినీ నటులు విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, బేబి సినిమా ఫేం వైష్ణవి చైతన్య, దర్శకుడు వంగ సందీప్ రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మహిళా కమిషన్ చైర్ పర్సన్ గద్వాల విజయ లక్ష్మి, బీసీ కమిషన్ సలహాదారుడు వి.హనుమంతరావు, మాజీ ఎంపీలు అంజన్ కుమార్ యాదవ్, తలసాని సాయికిరణ్ యాదవ్, నగర పోలీస్ కమిషనర్ వీ.సీ.సజ్జనార్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

## హర్మూజ్ జలసంధిపై వీడని ఉత్కంఠ..

జలసంధిలో నౌకల రాకపోకలను నియంత్రించేందుకు అమెరికా, ఇరాన్, ఒమన్ మధ్య ఒక ఒప్పందం కొన్ని రోజులుగా పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే విషయంపై ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి కూడా స్పందించారు. హర్మూజ్ జలసంధిలో తాత్కాలిక సముద్ర మార్గం ఏర్పాటుపై ఒమన్‌తో తాము ఒక ఒప్పందానికి చాలా దగ్గరగా ఉన్నామని తెలిపారు. ఇరు దేశాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందాన్ని అమెరికా ఉల్లంఘించడం ఆపేంత వరకు ఆ దేశంతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని అరాఘ్చి ఆదివారం టెహ్రాన్‌లో స్పష్టం చేశారు. అయితే, ట్రంప్ వ్యాఖ్యలు గత కొన్ని రోజులుగా పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. హర్మూజ్ జలసంధిని వెంటనే తెరవకపోతే ఇరాన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని గత మంగళవారం ఆయన హెచ్చరించారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇరాన్‌తో తాము చాలా మంచి చర్చలు జరుపుతున్నామని చెప్పారు. కానీ, వాషింగ్టన్‌తో ఎలాంటి చర్చలు జరగడం లేదని టెహ్రాన్ వెంటనే ఖండించింది. సోమవారం కూడా ట్రంప్ మాట్లాడుతూ.. "శిరచ్ఛేదం చేసే ముందు ఇరాన్‌కు ఇదే చివరి అవకాశం" అని తీవ్రంగా హెచ్చరించారు. హర్మూజ్ జలసంధిని రేపటికల్లా తెరిచేలా చర్చలు జరుగుతున్నాయని చెప్పినప్పటికీ, ఇరాన్ దానిని తోసిపుచ్చింది.

## రాజమండ్రి ప్రమాద ఘటనలో గాయపడిన ప్రియాంక మృతి



రాజమండ్రిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మెడికో ప్రియాంక మృత్యువుతో పోరాడి ఓడిపోయింది. గత ఐదు రోజులుగా సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం తుదిశ్వాస విడిచింది. ఓ వైద్యురాలిగా ఎంతో భవిష్యత్తు ఉన్న ప్రియాంక అర్థాంతరంగా తనువు చాలించడంతో ఆమె కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే, ఆగస్టు 3వ తేదీన తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని ప్రసాదిత్యమాల్ ప్రాంతంలో ప్రియాంక తన స్కూటర్‌పై వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. మద్యం మత్తులో అతివేగంగా కారు నడిపిన సురవరపు దశ్వంత్, ఆండ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్ అనే ఇద్దరు యువకులు ఆమె స్కూటర్‌ను ఉద్దేశపూర్వకంగా మూడుసార్లు ఢీకొట్టారు. ఈ ఘటనలో ప్రియాంక తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను రాజమండ్రిలోని స్థానిక ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని కిమ్స్‌కు తరలించారు. అక్కడ ఆమెను కాపాడేందుకు వైద్యులు తీవ్రంగా శ్రమించారు. అయినప్పటికీ ఆమె కోలుకోలేకపోయింది. శుక్రవారం మధ్యాహ్నం 3:25 గంటలకు ప్రియాంక తుదిశ్వాస విడిచినట్టు కిమ్స్ వైద్యులు ప్రకటించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితులు దశ్వంత్, ఆండ్రూలను ఇప్పటికే అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. కాగా, తన కుమార్తె మృతికి కారణమైన వారిపై సాధారణ ప్రమాద కేసు కాకుండా, హత్య కేసు నమోదు చేయాలని ప్రియాంక తండ్రి డిమాండ్ చేశారు. ఇది కేవలం ప్రమాదం కాదని, ఉద్దేశపూర్వకంగా చేసిన హత్యేనని ఆయన ఆరోపిస్తున్నారు. పోలీసులు కూడా సీసీటీవీ ఫుటేజి పరిశీలించిన అనంతరం, కావాలనే ఢీకొట్టినట్టు గుర్తించారు. హత్యాయత్నం సెక్షన్లతో కేసును మరింత పకడ్డందీగా మార్చారు. ప్రియాంక స్వస్థలం తెలంగాణలోని గద్వాల జిల్లా అయిజ మండలం ఎక్లాస్ పూర్. ఆమె ఎంబీబీఎస్ అనంతరం రాజమండ్రిలో పీజీ చేస్తోంది. ఇప్పుడు ఆమె మృతితో స్వగ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

# ఆదివాసీ గిరులు.. అవకాశాల గనులు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకురావడం కష్టం కాదు. గిరిజన ప్రాంతాలకు అనుసంధానం పెంచాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో 2,036 గిరిజన ఆవాసాలకు రహదారులను అనుసంధానించాం. ప్రతి ఆదివాసీ కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మిస్తాం. గిరిజనుల ఇళ్లపై సోలార్ పలకలను ఏర్పాటు చేస్తాం. రూ.1,000 కోట్లతో అడవితల్లికి బాటలు వేస్తున్నాం. 2027 డిసెంబరు నాటికి ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా తాగునీటిని అందిస్తాం. డోలీ మోతలు లేకుండా ఫీడర్ అంబులెన్స్‌లు, 108, 104 అంబులెన్స్‌లు ఏర్పాటు చేస్తున్నాం. మారుమూల గ్రామాల్లో సెల్‌సిగ్నల్స్ ఉండేలా టెలికమ్యూనికేషన్స్‌తో ఎంవోయూ చేసుకున్నాం. దేశంలో ఎక్కడా గిరిజనుల కోసం మూడు జిల్లాలు లేవు. తొమ్మిది ఐటీడీఏ సెంటర్లు, గిరిజన కార్పొరేషన్ కూడా ఉన్నాయి. వీటన్నిటినీ అనుసంధానిస్తే అద్భుతాలు సృష్టించవచ్చు' అని స్పష్టంచేశారు. అల్లూరి సీతారామరాజు పోరాట పటిమను, కీర్తిని తెలియజేసేలా భోగాపురం విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టామన్నారు. థింసా మొన్నటి వరకు నృత్యం మాత్రమేనని.. ఇప్పుడు గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కిందని తెలిపారు. గిరిజనులు ఒకప్పుడు పోడు వ్యవసాయం చేసేవారని, ఇప్పుడది ఆగిందన్నారు. ఈ సందర్భంగా గిరిపుత్రుల అభివృద్ధికి 19 సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకున్నారు. సీఎం ఇంకా ఏం చెప్పారంటే.. రాష్ట్రంలో 4.92 లక్షల మంది గిరిజన విద్యార్థులు ఉన్నారు. తల్లికి వందనం పథకం కింద వారికి రూ.650 కోట్లు అందజేశాం. ఒకప్పుడు ప్రైవేటు స్కూళ్లకు వెళ్లే వాళ్లంతా కూటమి ప్రభుత్వం వచ్చాక రివర్స్ గేర్‌లో ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో ఐఐటీ ఆలిండియా పరీక్షలు పెడితే మొదటిసారి 21 మంది గిరిజన విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఆ అనుభవంతో విశాఖపట్నం మేకవానిపాలెంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటుచేసి 600 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. వారిలో కనీసం 100 మంది విద్యార్థులు ఆలిండియా పరీక్షల్లో ఉత్తీర్ణులై చరిత్ర సృష్టించాలి. ఆదివాసీ విద్యార్థులను ఏఐ వరకు తీసుకెళ్లడానికి చెన్నై ఐఐటీతో ఎంవోయూ కుదుర్చుకున్నాం. త్వరలోనే గిరిజనులకు ఇంటి వద్దే వైద్యం చేయిస్తాం. గిరిజన ప్రాంతాల్లో ఉంటున్నవారిలో ఎనీమియా ఎక్కువగా ఉంది. ఈ లోపాన్ని త్వరలో నివారిస్తాం. బాధితులకు రూ.10 వేల పింఛన్ ఇస్తున్నాం. గిరిజన ప్రాంతాల నుంచి ప్రకృతి సహజసిద్ధమైన ఉత్పత్తులకు బెస్ట్ బ్రాండ్‌ను తీసుకొస్తాం. సీతంపేట పసుపు, రంపచోడవరం రబ్బరు, పార్వతీపురం పైనాపిల్, తేనె, తాటిబెల్లానికి ప్రపంచ గుర్తింపు, బ్రాండింగ్ తీసుకొస్తాం. చక్కెర తినే రోజులు పోతున్నాయి. తాటిబెల్లమే కదా అనుకోవద్దు. అది ఆరోగ్యానికి మంచిది. కాఫీ, టీ తాగాలంటే తాటిబెల్లం వేసుకునే రోజులు వస్తాయి. గిరిజనులకు సహకరించే అందరినీ దేశం నలుమూలల నుంచీ రప్పించి ఎంవోయూలు చేసుకున్నాం. మన్యం ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఆదివాసీ ఇల్లు ఓ అతిథి గృహం కావాలి. మన్యంలో సుందర ప్రాంతాలు ఉన్నాయి. పాడేరు, అరకు, లంబసింగి.. కశ్మీరు కంటే బాగుంటాయి. కుంకుమపువ్వు, ఆవకాడో పంటలు కశ్మీరులోనే కాదు.. మన మన్యంలోనూ సాగవుతాయి. పాతికేళ్ల కిందట నేనే కాఫీ తోటల సాగును మొదలు పెట్టించాను. దానికి అరకు కాఫీ అని పేరు పెట్టాం. దానిని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడానికి నాంది ఫౌండేషన్ ముందుకొచ్చింది. ప్రధాని మన్‌కీబాత్‌లో అరకు కాఫీ గురించి చెప్పారు. ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లినప్పుడు ఆ దేశ ప్రధానికి అరకు కాఫీ పొడిని బహుమతిగా ఇచ్చారు. నన్ను కలవడానికి వచ్చిన వాళ్లందరికీ ఏమి ఇచ్చినా ఇవ్వకపోయినా.. అరకు కాఫీ మాత్రం కచ్చితంగా ఇస్తాను. దీనిని బెస్ట్ బ్రాండ్‌గా తయారు చేస్తాం. గిరిజన ఉత్పత్తులకు విలువను జోడించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. మైదాన ప్రాంతాల కంటే గిరిజన ప్రాంతాల్లో ఎక్కువ ఆదాయం రావడం ఆనందదాయకం. స్థానిక గిరిజనులకే ఉద్యోగావకాశాలు ఉండాలని నాడు ఎన్టీఆర్ భావించారు. దీనికి నేను 2003లో జీవో నంబర్ 3 జారీచేశాను. 20 ఏళ్లు అమల్లో ఉన్న ఈ జీవోను సుప్రీంకోర్టు కొట్టివేస్తే అప్పుడు సీఎంగా ఉన్న జగన్ సరిగా స్పందించలేదు. ఫలితంగా గిరిజనులు.. ఉన్న హక్కును కోల్పోయారు. ఇప్పుడు మళ్లీ ఈ సమస్య నా వద్దకు వచ్చింది. దీనిని సరిచేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ప్రతి మనిషికీ విజన్ ఉండాలి.

## పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి కేసీఆర్ పరామర్శ..

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ ప్రకటించిన రూ.2.25 కోట్ల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను కేసీఆర్ స్వయంగా సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. నల్లబెల్లిలోని నివాసానికి చేరుకున్న కేసీఆర్, తొలుత సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సుదర్శన్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. సుదర్శన్‌రెడ్డి అత్యంత సాదాసీదా జీవితం గడిపారని, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మంచి నేత అని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రకటించిన ఆర్థిక సాయంలో భాగంగా సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లల పేరున చెరో రూ.1 కోటి, ఆయన తల్లి అమృతమ్మ సంరక్షణ కోసం రూ.25 లక్షల చెక్కులను కేసీఆర్ అందించారు. పిల్లల చదువులు, భవిష్యత్తుతో పాటు కుటుంబ సంక్షేమ బాధ్యతలను పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. కేసీఆర్ రాక సందర్భంగా నల్లబెల్లికి బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాసం వద్ద జనం కిక్కిరిసిపోవడంతో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి, పరిస్థితిని అదుపులోకి తెచ్చి కేసీఆర్ కాన్వాయ్‌కు దారి కల్పించారు. కేసీఆర్ వెంట పలువురు పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.






## ఇవాళ జరిగిన దాడిలో చనిపోయి ఉండేదాన్ని: మమతా బెనర్జీ

(మొదటి పేజీ తరువాయి)



పశ్చిమ బెంగాల్‌లో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రయాణిస్తున్న కారుపై నిరసనకారులు దాడికి పాల్పడ్డారు. కోల్‌కతా సమీపంలోని ఉత్తర 24 పరగణాల జిల్లా హాలిసహర్‌లో ఈ ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఆమె కాన్వాయ్‌పై కొందరు రాళ్లు, ఇటుకలు, వాటర్ బాటిళ్లు విసిరారు. పోలీసు కస్టడీలో మరణించినట్లు భావిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కార్యకర్త బిర్జూ కియోట్ కుటుంబాన్ని పరామర్శించేందుకు మమతా బెనర్జీ వెళుతుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. దోపిడీ ఆరోపణలపై అరెస్టయిన బిర్జూ, పోలీసుల కస్టడీలో మరణించాడు. ఈ నేపథ్యంలో, మమత పర్యటనను వ్యతిరేకిస్తూ స్థానికులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఆమె కారును చుట్టుముట్టి, దానిపై బురద పూశారు. "చోర్ భగావో" (దొంగను తరిమేయండి) అంటూ నినాదాలు చేశారు. ఈ దాడిపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. పోలీసుల సమక్షంలోనే గుర్తుతెలియని వ్యక్తులు తన వాహనంపై రాళ్లతో దాడి చేశారని ఆమె ఆరోపించారు. "కారు అద్దాలు మూసి ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డాను. లేదంటే ఆ రాళ్లు తలకు తగిలి నా తల పగిలిపోయేది" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని, వారు కేవలం అధికార బీజేపీకి మాత్రమే రక్షణ కల్పిస్తున్నారని మండిపడ్డారు. ఆమెతో పాటు ఉన్న లోక్‌సభ ఎంపీ కల్యాణ్ బెనర్జీ, రాజ్యసభ ఎంపీ డోలా సేన్ కూడా అధికారుల వైఫల్యాన్ని విమర్శించారు. ఈ ఘటనను రాష్ట్ర బీజేపీ చీఫ్ సమీక్ భట్టాచార్య ఖండించారు. ఈ దాడితో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను డిమాండ్ చేశారు. అయితే, సీఎం సువేందు అధికారి దీన్ని మమత సృష్టించిన డ్రామాగా అభివర్ణించారు. కస్టడీ మరణాన్ని రాజకీయం చేసేందుకే మమత బలవంతంగా ఆ ప్రాంతానికి వెళ్లారని ఆరోపించారు. మృతుడి కుటుంబ సభ్యులు అధికారుల తీరుపై సంతృప్తి చెందారని, మరణానికి కచ్చితమైన కారణం తెలియాలని మాత్రమే వారు కోరుకుంటున్నారని తెలిపారు. తన పర్యటనతో మమత ప్రజా జీవితానికి ఆటంకం కలిగించారని విమర్శించారు. ఇటీవలే మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై కూడా ఆయన నియోజకవర్గంలో దాడి జరిగిన నేపథ్యంలో, తాజా ఘటనతో రాష్ట్రంలో రాజకీయ ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

# ప్రతిష్టంభనకు తెరపడేనా?

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు చివరి అంకానికి చేరుకున్నాయి. తీవ్ర ఆందోళనల కారణంగా దాదాపుగా ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండానే రెండు వారాల సమయం గడిచిపోయింది. ఈ సెషన్‌లో ఇక మిగిలింది కేవలం నాలుగు రోజులు మాత్రమే. ప్రభుత్వానికి, ప్రతిపక్షాలకు మధ్య ప్రతిష్టంభన తారస్థాయికి చేరడంతో సభా కార్యకలాపాలు సజావుగా సాగడం కష్టమేనని అంటున్నారు. పరీక్షల అక్రమాలు, పేపర్ లీకేజీలపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఢిల్లీ పోలీసుల లాఠీచార్జి, పెల్లెట్ గన్స్ ప్రయోగంపై హోం మంత్రి అమిత్ షా లోక్‌సభలో స్పష్టమైన ప్రకటన చేయాలని విపక్షాలు పట్టుబడుతున్నాయి. అయోధ్య రామమందిర విరాళాల చోరీ అంశంపై ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నాయి. అయితే సభకు ఏ మంత్రి వచ్చి జవాబు చెప్పాలో ప్రతిపక్షాలు నిర్ణయించలేవని అధికార పక్షం తేల్చిచెప్పడంతో సభలో నిరసనల పర్వం కొనసాగుతోంది. నిరసనలు, నినాదాల నడుమ లోక్‌సభలో 8 బిల్లులకు ఆమోదముద్ర పడింది. లోక్‌సభకు కేటాయించిన మొత్తం 90 పనిగంటల్లో సరిగ్గా నడిచింది కేవలం 15 గంటల 36 నిమిషాలు మాత్రమే. ఈ సమయంలోనూ సింహభాగం, దాదాపుగా 11 గంటలు ఒక్క పరీక్షల అక్రమ మార్గాల నివారణ సవరణ బిల్లు'పై చర్చకే వెచ్చించారు. ఈ బిల్లుపై 48 మంది ఎంపీలు మాట్లాడారు. మిగిలిన 7 ఇతర ముఖ్యమైన బిల్లులను విపక్షాల నినాదాలు, ఆందోళనల మధ్య సమగ్ర చర్చ లేకుండా కేవలం 36 నిమిషాల వ్యవధిలోనే సభ ఆమోదించేసింది. రాజ్యసభ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. 15 రోజుల్లో ఎగువ సభ కేవలం 24.21 గంటలు మాత్రమే సమావేశమైంది. ఈ చివరి నాలుగు రోజుల్లో మరో 7 కీలక బిల్లులను ఆమోదింపజేసుకోవాలని కేంద్రం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. విదేశీ విరాళాల క్రమబద్ధీకరణ (ఎఫ్‌సీఆర్‌ఏ) సవరణ బిల్లు, ట్రిబ్యునళ్ల సంస్కరణల బిల్లు, 'గనులు--ఖనిజాల అభివృద్ధి సవరణ బిల్లు, 'నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బిల్లు, 'కేరళ పేరు మార్పు బిల్లు'ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉంది. రాజ్యసభలో 'బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ బిల్లు', 'పన్నుల సవరణ బిల్లు'లను ఆమోదింపజేసుకోవాలని భావిస్తోంది. కీలక బిల్లులేవీ సోమవారం సభలో ప్రవేశపెట్టే అవకాశం లేదు. ముఖ్యంగాఎఫ్‌సీఆర్‌ఏ బిల్లును అనుమతించేదే లేదంటూ కాంగ్రెస్ స్పష్టం చేస్తోంది. 10, 11, 12వ తేదీల్లో సభకు తప్పనిసరిగా హాజరుకావాలంటూ కాంగ్రెస్ తమ ఎంపీలకు విప్ కూడా జారీ చేసింది.

### కుదరని సయోధ్య

సభలో చోటుచేసుకుంటున్న జాప్యాన్ని, రచ్చను నివారించేందుకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో రెండుసార్లు భేటీ అయ్యారు. ఫోన్‌లోనూ మాట్లాడారు. డీలిమిటేషన్, ఎఫ్‌సీఆర్‌ఏ బిల్లులపై సహకరించాలని కోరారు. అయినప్పటికీ, తమ డిమాండ్లపై కాంగ్రెస్ ఇతర విపక్షాలు పట్టుబట్టడంతో సయోధ్య సాధ్యం కాలేదు. విద్యార్థులపై దాడి, విరాళాల చోరీ అంశాలపై వెనక్కి తగ్గేది లేదని విపక్షాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లులను, వ్యూహాలను విపక్షాలు ఏ రకంగా అడ్డుకుంటాయో, పార్లమెంట్ చివరి నాలుగు రోజులు ఎలా సాగుతాయి అనేది చర్చనీయాంశమైంది.

# రైతులకు కరెంట్ కష్టాలు తీర్చాలి!





- 24 గంటల నాణ్యమైన త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేయాలి
- రామన్నపేట విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ ధర్నా
- రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి : మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**తొలివెలుగు, రామన్నపేట:** రైతులకు నిరంతరాయంగా 24 గంటల నాణ్యమైన త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం రామన్నపేట మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులు విద్యుత్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. రైతులకు 24 గంటల పాటు నాణ్యమైన త్రీఫేస్ విద్యుత్ అందించాల్సి ఉండగా, ప్రస్తుతం సుమారు 10 గంటల పాటు మాత్రమే విద్యుత్ సరఫరా జరుగుతోందని పేర్కొన్నారు. దీంతో వ్యవసాయ పనులు సక్రమంగా సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**లో-వోల్టేజీతో కాలిపోతున్న మోటార్లు:**

విద్యుత్ సరఫరాలో తరచూ లో-వోల్టేజీ సమస్యలు తలెత్తుతున్నాయని, దీని కారణంగా రైతుల మోటార్లు, స్టార్టర్లు కాలిపోతూ తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతోందని చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. ఇప్పటికే వ్యవసాయ రంగంలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్న రైతులకు విద్యుత్ సమస్యలు మరింత భారంగా మారాయని అన్నారు. రైతులు పంటలకు నీరు అందించేందుకు విద్యుత్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లో-వోల్టేజీ సమస్యల కారణంగా వ్యవసాయ మోటార్లు దెబ్బతిని రైతులు అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని తెలిపారు.

**24 గంటల విద్యుత్ ఇవ్వాలి:**

ప్రభుత్వం ఇప్పటికైనా రైతుల ఇబ్బందులను గుర్తించి, నిరంతరాయంగా 24 గంటల నాణ్యమైన త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లో-వోల్టేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించి, రైతుల మోటార్లు, స్టార్టర్లు, ఇతర విద్యుత్ పరికరాలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా అత్యవసరమని, రైతులు ఇబ్బందులు పడకుండా విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం:**

ధర్నా అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు బందెల రాములు, పోషబోయిన మల్లేశం, సర్పంచులు కంభంపాటి శ్రీనివాస్, గర్దాస్ విక్రమ్, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు రేఖ యాదయ్య, పున్న వెంకటేశం, ఎండీ అమీర్, జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం, బద్దుల రమేష్, పట్టణ కార్యదర్శి జాడ సంతోష్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## జైల్‌భరోను విజయవంతం చేయాలి

- కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్
- సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి
- సీఐటీయూ కరపత్రాన్ని ఆవిష్కరించిన జిల్లా సహాయ కార్యదర్శి గోరిగే సోములు

**తొలివెలుగు, రామన్నపేట:** ఈ నెల 10న నిర్వహించనున్న జైల్‌భరో కార్యక్రమాన్ని కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ కార్యదర్శి గోరిగే సోములు పిలుపునిచ్చారు. రామన్నపేట మండల కేంద్రంలో ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో జైల్‌భరో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోరిగే సోములు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులకు భంగం కలిగించే విధానాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం అందించడంతో పాటు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు రూ.26 వేల వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. నూతనంగా తీసుకొచ్చిన మోటార్ వెహికల్ చట్టాన్ని కూడా ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక, ఉద్యోగ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న జైల్‌భరో కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నకరికంటి రాము, జిల్లా కమిటీ సభ్యులు అప్పం సురేందర్, వంగల మారయ్య, బుడ్డ ప్రసాద్, జంపాల మహేష్, నూనె అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధిత ఆంజనేయులను పరామర్శించిన పూస బాలకిషన్



**తొలివెలుగు, రామన్నపేట:** మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన రాచకొండ ఆంజనేయులు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ యాదాద్రి జిల్లా నాయకుడు పూస బాలకిషన్ ఆదివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆంజనేయుల క్షేమ సమాచారాన్ని, చికిత్స వివరాలను ఆరా తీసి, త్వరితగతిన పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శించిన వారిలో నాయకులు తెడ్డు వెంకటేశం, కొండం రాంరెడ్డి, గర్దాస్ వేణు, పగుడాల భరత్, కేస సాయి, కంబాలపల్లి నరేష్, కంబాలపల్లి నరసింహ, చిన్నలచ్చి రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

## ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

- చదువును మధ్యలో మానేసిన వారికి సువర్ణావకాశం
- ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ
- కోఆర్డినేటర్ వై. కిష్టయ్య



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** వివిధ కారణాలతో చదువును మధ్యలోనే మానేసిన వారికి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్ కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కోఆర్డినేటర్ వై. కిష్టయ్య తెలిపారు. చదువును కొనసాగించాలనే ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు స్థానిక జెడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో సంప్రదించి అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్ విద్య ద్వారా వివిధ కారణాలతో చదువుకు దూరమైన వారు తమ విద్యను కొనసాగించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

**ఎస్ఎస్‌సీ అడ్మిషన్లకు కావాల్సిన ధ్రువపత్రాలు:**

ఓపెన్ పదవ తరగతి అడ్మిషన్ పొందేందుకు అభ్యర్థులు చదివిన రికార్డు షీట్, టీసీ, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను తీసుకురావాలని కోఆర్డినేటర్ తెలిపారు.

**ఇంటర్ అడ్మిషన్లకు అవసరమైన పత్రాలు:**

ఇంటర్ ఆర్ట్స్ గ్రూప్‌లో ప్రవేశం పొందే అభ్యర్థులు ఎస్ఎస్‌సీ టీసీ లేదా ఓపెన్ ఎస్ఎస్‌సీ టీసీ, ఆధార్ కార్డు జిరాక్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో సంప్రదించాలని సూచించారు. ఈ నెల 15వ తేదీ వరకు అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8341960246, 9949304118 ఫోన్ నంబర్లను సంప్రదించాలని వై. కిష్టయ్య కోరారు. చదువును మధ్యలో నిలిపివేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ విద్యను కొనసాగించాలని సూచించారు.



## ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

- భూదాన్ పోచంపల్లిలో జెండా ఆవిష్కరణ
- యువతే కాంగ్రెస్ పార్టీకి కీలక శక్తి : ఉప్పునూతల వెంకటేష్ యాదవ్

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో ఆదివారం ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గ్యార సందీప్ ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత యువజన కాంగ్రెస్‌పై ఉందన్నారు. ప్రభుత్వ పథకాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీలో యువజన కాంగ్రెస్ పాత్ర అత్యంత కీలకమని అన్నారు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు, ప్రజా సమస్యలపై పోరాడే స్ఫూర్తిని యువజన కాంగ్రెస్ కల్పిస్తోందని పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం యువజన కాంగ్రెస్ సైనికుల్లా పనిచేస్తోందని అన్నారు. రానున్న రోజుల్లో యువజన కాంగ్రెస్ నాయకులే పార్టీని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే శక్తిగా నిలుస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. యువత పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రజా సమస్యలపై స్పందిస్తూ సామాజిక బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కాసుల అంజయ్య, టౌన్ ప్రధాన కార్యదర్శి గునీగంటి వెంకటేష్, సెక్రటరీ కుక్క కుమార్, ఎస్సీ సెల్ టౌన్ అధ్యక్షుడు కుక్క బాలనరసింహ, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కర్నాటి గణేష్, టౌన్ ప్రధాన కార్యదర్శి సురేష్, యువజన విభాగం ప్రధాన కార్యదర్శులు నవీన్, మహేష్, పెద్దల సుధాకర్, చీరాల మహేష్, అసెంబ్లీ సెక్రటరీ రుద్ర చందు, ఎన్ఎస్‌యూఐ టౌన్ అధ్యక్షుడు కుక్క అరుణ్, ఉపాధ్యక్షులు కుక్క వంశీ, కుక్క శివ, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కోమటిరెడ్డి లక్ష్మి మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలి

- సీతారామచంద్రస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ల మురళి ఆకాంక్ష

**తొలివెలుగు, చౌటుప్పల్:** కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్మన్ కోమటిరెడ్డి లక్ష్మి రాజగోపాల్‌రెడ్డి మరెన్నో జన్మదిన వేడుకలు ఆయురారోగ్యాలతో జరుపుకోవాలని చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ల మురళి ఆ దేవున్ని ప్రార్థించారు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సతీమణి కోమటిరెడ్డి లక్ష్మి జన్మదినం సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని వారి స్వగృహంలో బొబ్బిళ్ల మురళి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అష్టలక్ష్మి దేవాలయంలోని అమ్మవారి ప్రసాదాన్ని అందజేసి, కోమటిరెడ్డి లక్ష్మికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా పేద ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల ఆదరాభిమానాలు పొందుతున్న కోమటిరెడ్డి లక్ష్మి నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో విలసిల్లాలని అమ్మవారిని కోరుకున్నట్లు మురళి తెలిపారు. పేద ప్రజల సేవే పరమావధిగా అహర్నిశలు కృషి చేస్తున్న కోమటిరెడ్డి లక్ష్మి రాజగోపాల్‌రెడ్డికి భగవంతుడు మరింత శక్తి, ఆరోగ్యం ప్రసాదించి ప్రజాసేవలో ముందుకు సాగేందుకు ఆశీర్వదించాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.



## వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లో ఘనంగా బోనాల ఉత్సవాలు





- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
- అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు

**తొలివెలుగు, ఎల్‌బీనగర్:** వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్‌లో బోనాల పండుగ ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బోనాల వేడుకలకు ఎల్‌బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ ఉత్సవాలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ లగ్గోని శ్రీధర్ గౌడ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## జెప్టో డెలివరీకి వెళ్లి యువకుడు అదృశ్యం

- నాలుగు రోజులుగా ఆచూకీ లేక కుటుంబ సభ్యుల్లో ఆందోళన
- నాగోలు పోలీసుల దర్యాప్తు



**తొలివెలుగు, నాగోలు:** జెప్టో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న ఓ యువకుడు విధులకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటన నాగోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోలులోని కో-ఆపరేటివ్ బ్యాంక్ కాలనీకి చెందిన సైదు భాగ్యరాజు (34) స్వస్థలం కృష్ణా జిల్లా గుమ్మలపాడు గ్రామం. ఆయన జెప్టో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 4వ తేదీన డెలివరీ పని ఉందని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన భాగ్యరాజు తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు, పరిచయస్తుల వద్ద ఆరా తీసినప్పటికీ ఆయన ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళనకు గురైన భాగ్యరాజు భార్య రేవతి నాగోలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భాగ్యరాజు ఎక్కడికి వెళ్లాడు, చివరిసారిగా ఎవరిని కలిశాడు, ఎవరితోనైనా ఫోన్‌లో మాట్లాడాడా అనే కోణాల్లో పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. అతడి ఫోన్ కాల్ వివరాలతో పాటు ఇతర ఆధారాలను పరిశీలిస్తూ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు నాగోలు సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు. భాగ్యరాజు ఆచూకీ లభించిన వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందిస్తామని పోలీసులు పేర్కొన్నారు.

## కిరాణా దుకాణంలో అక్రమ మద్యం విక్రయం

- మహిళను అదుపులోకి తీసుకున్న ఎల్‌బీనగర్ పోలీసులు
- సుమారు 12 లీటర్ల మద్యం స్వాధీనం



**తొలివెలుగు, ఎల్‌బీనగర్:** కిరాణా దుకాణం ముసుగులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను ఎల్‌బీనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎన్‌టీఆర్ నగర్‌లోని మార్కెట్ లేన్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్‌టీఆర్ నగర్ ప్రాంతంలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్న మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు ఎల్‌బీనగర్ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఆదివారం మధ్యాహ్నం పోలీసులు అక్కడికి చేరుకుని తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన ఎన్. మహాలక్ష్మి (36) తన కిరాణా దుకాణంలో ఎలాంటి అనుమతులు లేకుండా వివిధ బ్రాండ్లకు చెందిన మద్యం బాటిళ్లను విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రజలకు అక్రమంగా మద్యం విక్రయిస్తూ లాభాలు పొందుతున్నట్లు తెలిపారు. దుకాణంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు వివిధ కంపెనీలకు చెందిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం సుమారు 12 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ ఘటనపై మహిళపై తెలంగాణ ఎక్సైజ్ చట్టంలోని సెక్షన్ 34(ఎ) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్‌బీనగర్ పోలీసులు తెలిపారు.

## మహేష్ కుటుంబానికి పీసీఆర్ ఫౌండేషన్ చేయూత

- మృతుని కుటుంబానికి 50 కేజీల బియ్యం పంపిణీ
- ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముదుగు ప్రవీణ్ కుమార్

**తొలివెలుగు, జన్నారం:** జన్నారం పట్టణంలోని పొనకల్ సుందరయ్య నగర్ కాలనీలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన శనిగారపు మహేష్ కుటుంబానికి పీసీఆర్ (పూర్ణచందరావు) ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముదుగు ప్రవీణ్ కుమార్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. కుటుంబం ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సహాయంగా 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు తమ వంతు సహాయం అందించడం పీసీఆర్ ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు. అవసరంలో ఉన్న కుటుంబాలకు భవిష్యత్తులో కూడా ఫౌండేషన్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఫజల్ ఖాన్, మున్వర్ అలీఖాన్, సులువ జనార్ధన్, ఇమ్రాన్, చింతల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## ఆదివాసీల హక్కుల కోసం పోరాటం చేస్తాం

- ప్రభుత్వాలు గిరిజనుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్
- తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమావత్ సక్రు నాయక్



**తొలివెలుగు, ఎల్‌బీనగర్:** ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం సరూర్‌నగర్ మండలంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శి చర్లపల్లి వీరయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రమావత్ సక్రు నాయక్ ముఖ్య అతిథిగా హాజరై సమాఖ్య జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమావత్ సక్రు నాయక్ మాట్లాడుతూ.. ఆదివాసీ, గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తామని అన్నారు. రాష్ట్రంలో గిరిజనుల హక్కులకు భంగం కలిగించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. గిరిజనుల రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచుతూ తెలంగాణ శాసనసభలో బిల్లు ఆమోదించినప్పటికీ, రాష్ట్రపతి ఆమోదం కోసం ఇంకా పెండింగ్‌లో ఉండటం విచారకరమన్నారు. తరతరాలుగా గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అటవీ హక్కుల చట్టం-2006 ప్రకారం గిరిజనులకు అటవీ భూములపై హక్కులు కల్పించాలని కోరారు. రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో గనులు, పరిశ్రమల ఏర్పాటుకు ముందు గ్రామసభల అనుమతి తప్పనిసరి చేయాలని డిమాండ్ చేశారు.

**సంస్కృతి, భాషల పరిరక్షణకు ప్రత్యేక నిధులు:**

ఆదివాసీల ప్రత్యేక ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. గోండి, కోలాం తదితర గిరిజన భాషల పరిరక్షణ, అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. గిరిజన గురుకులాల్లో నాణ్యమైన విద్య అందించడంతో పాటు ప్రతి గిరిజన తండాలో ప్రాథమిక వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఎవరితోనైనా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని రమావత్ సక్రు నాయక్ స్పష్టం చేశారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు. వడ్త్యా బుజ్జి, టి. రాము, ముఖేష్, గణేష్, కోటి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి ఆలయాల్లో మహేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు





- బోనాల పండుగ సందర్భంగా పలు దేవాలయాల సందర్శన
- ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించిన బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి

**తొలివెలుగు, ఎల్‌బీనగర్:** బోనాల పండుగను పురస్కరించుకుని గడ్డిఅన్నారం డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి ఆదివారం పలు అమ్మవారి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ప్రగతినగర్ కాలనీలోని శ్రీ పోచమ్మతల్లి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీ కోదండరాంనగర్ కాలనీ (సిసలబస్తీ)లోని శ్రీశ్రీశ్రీ పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం చైతన్యపురి డివిజన్ పరిధిలోని మైసమ్మ-పోచమ్మ దేవాలయం, శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయాలను సందర్శించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. వనస్థలిపురం డివిజన్‌లోని మైసమ్మ దేవాలయాన్ని కూడా సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ ఉత్సవాలు ప్రజల్లో ఐక్యతను, ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. భాగ్యనగర ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆయా ఆలయాల కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక నాయకులు, బీజేపీ డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- బత్తిని వరుణ్ గౌడ్ ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ
- కాంగ్రెస్ పార్టీకి యువజన కాంగ్రెస్ వెన్నెముక : బత్తిని వరుణ్ గౌడ్



**తొలివెలుగు, వలిగొండ:** యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వలిగొండ పట్టణ కేంద్రంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిని వరుణ్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బత్తిని వరుణ్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి యువజన కాంగ్రెస్ వెన్నెముక లాంటిదని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ, సామాన్య ప్రజల గొంతుకగా యువజన కాంగ్రెస్ క్రియాశీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. దేశంలోని యువతకు రాజకీయ వేదికను కల్పించడం, వారి హక్కుల కోసం పోరాడటం, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడం యువజన కాంగ్రెస్ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. యువత రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై సమర్థవంతంగా పోరాటం చేయాలని సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మంగ ప్రవీణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట గిరీష్ గౌడ్ హాజరయ్యారు. వారు యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్తిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పోలేపాక జానకిరాములు, పీఎస్‌సీఏ చైర్మన్ గరిసె రవి, వైస్ చైర్మన్ జంగారెడ్డి, మాజీ ఎంపీపీ నూతి రమేష్‌రాజ్, బత్తిని లింగయ్య గౌడ్, చెరుకు శివయ్య, పలుసం సతీష్, సంజీవరెడ్డి, కాసుల వెంకన్న గౌడ్, సాయి, లింగస్వామి, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు దేవేందర్, శ్రీశైలం, నవీన్ యాదవ్, అసెంబ్లీ ఉపాధ్యక్షుడు చేగురి బాలు, ప్రధాన కార్యదర్శులు కొంతం నవీన్, బుగ్గ ఉదయ్, చిన్నపాక నరేందర్, మండల అధ్యక్షుడు మైసోళ్ల ప్రవీణ్, ఉపాధ్యక్షులు ఓర్సు మనోజ్, మహిపాల్, లోడే శ్రీకాంత్, సాయి, నాయకులు పూసుకూరి లింగస్వామి, మారగోని సురేష్, బాలు, శ్రీకాంత్, విన్ను, కృష్ణ, మధు తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరం విజయవంతం

● పద్మజ్యోతి యువజన సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

**తొలివెలుగు, చౌటుప్పల్:** సమాజ సేవలో భాగంగా కొయ్యలగూడెం పద్మజ్యోతి యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వనస్థలిపురంలోని ప్రగ్మా హాస్పిటల్స్ వైద్య బృందం ఈ శిబిరంలో పాల్గొని స్థానిక ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించింది. శిబిరంలో పాల్గొన్న వారికి ఉచితంగా రక్తపోటు, మధుమేహం, రక్త పరీక్షలతో పాటు ఈసీజీ, 2డీ ఈకో పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పద్మజ్యోతి యువజన సంఘం అధ్యక్షుడు బడుగు కైలాసం మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సహాయం అందించిన పద్మజ్యోతి యువజన సంఘం సభ్యులను గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు వెంకటేశం, రాజు, సురేందర్, రాఘవేంద్ర, ఆనంద్, శ్రీను, శేఖర్, గిరీష్, పాండు, సతీష్, సంతోష్, శ్రీనాథ్‌తో పాటు గ్రామ పెద్దలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



**తొలివెలుగు, చౌటుప్పల్:** రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందిన ఘటన చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తూప్రాన్‌పేట్‌లో చోటుచేసుకుంది. చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం (ఆగస్టు 8) రాత్రి సుమారు 10 గంటల సమయంలో తూప్రాన్‌పేట్ ప్రాంతంలో రహదారిపై సుమారు 30 నుంచి 40 ఏళ్ల వయస్సు గల ఓ వ్యక్తి ప్రమాదానికి గురై మృతిచెందాడు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు పత్రాలు లభించలేదు. మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుడు సుమారు 5.5 అడుగుల ఎత్తు కలిగి, గులాబీ రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతడి కుడిచేతిపై 'అమ్మ' అని పచ్చబొట్టు పొడిచి ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్ తెలిపారు. మృతుడి ఆచూకీ లేదా వివరాలు తెలిసిన వారు చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించేందుకు 8712662744 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

## కొయ్యలగూడెం వరసిద్ధి వినాయక ఆలయ నూతన కమిటీ ఎన్నిక

● నూతన అధ్యక్షుడిగా రవ్వ సంతోష్ కుమార్ ఏకగ్రీవ ఎన్నిక

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, ఆలయ కార్యక్రమాలను మరింత ఘనంగా నిర్వహించాలనే ఉద్దేశంతో నూతన కమిటీని ఏర్పాటు చేశారు.సర్వసభ్య సమావేశానికి గ్రామ సర్పంచ్ కరింకొండ స్వప్న అశోక్, ఉప సర్పంచ్ జెల్ల పవన్, రామాలయం చైర్మన్ మాచర్ల సంతోష్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వరసిద్ధి వినాయక స్వామి దేవాలయ నూతన అధ్యక్షుడిగా రవ్వ సంతోష్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా ఆలయ నూతన డైరెక్టర్లుగా ఏలే మురళి, సూరకంటి మోహన్‌రెడ్డి, కొయ్యడి స్వామి గౌడ్, అల్మాస్‌పేట గౌతమ్, రాసాల నర్సింహా, దికొండ ఉదయ్ కిరణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను సర్వసభ్య సమావేశంలో పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ ప్రతిష్ఠను మరింత పెంపొందిస్తూ, భక్తుల సహకారంతో దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామ ప్రజలు, భక్తులు అందరూ సహకరించి ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వారు కోరారు.



# స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలి: ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం


● చౌటుప్పల్‌లో 'ప్రజా చైతన్య యాత్ర'కు ఘన స్వాగతం




**తొలివెలుగు, చౌటుప్పల్:** స్థానిక పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగ యువతకు తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ప్రజా చైతన్య యాత్ర' ఆదివారం చౌటుప్పల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక ప్రజలు అన్ని విధాలుగా నష్టపోతున్నప్పటికీ, పరిశ్రమల యాజమాన్యాలు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. చౌటుప్పల్ పరిధిలోని పరిశ్రమల కారణంగా వందలాది ఎకరాల వ్యవసాయ భూములు, పంటలు, భూగర్భ జలాలు తీవ్రంగా కలుషితమవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమల వల్ల పర్యావరణ పరంగా నష్టపోతున్న స్థానిక గ్రామాల యువతకు ఉద్యోగాలు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందన్నారు. కనీస భద్రతా ప్రమాణాలు పాటించకుండా నిబంధనలకు విరుద్ధంగా కొన్ని పరిశ్రమలు నడుస్తున్నాయని ఆరోపించారు. ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో సమాచారం బయటకు రాకుండా చూసి, కార్మిక కుటుంబాలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నామమాత్రపు తనిఖీలకే పరిమితమై పరిశ్రమల యాజమాన్యాలకు వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి స్థానిక యువతకు పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామీణ యువతను సమీకరించి పరిశ్రమల ఎదుట ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను అదుపులోకి తెచ్చి పేద, మధ్యతరగతి ప్రజలను ఆదుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్‌రెడ్డి, బచ్చనగోని గాలయ్య, టీఎస్‌పీఎన్ఎమ్ రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్దె శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు దుబ్బాక భాస్కర్, కలకొండ సంజీవ, చిలివేరు అంజయ్య, సుర్వి నర్సింహా, కొందూరి వెంకటేష్, బూడిగపాక జగన్, చలం పాండురంగరావు, ముత్యాల అంజయ్య, పిల్లి శంకరయ్య, ఉడుత రామలింగం, బద్దుల సుధాకర్, టంగుటూరు రాములు, రొండి నర్సింహా, దాసరి అంజయ్య, రోషణగారి అంజయ్య, గుడ్డేటి బిక్షపతి, కుంటి పాపయ్య, మనోహర్‌తో పాటు ఏఐటీయూసీ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# యాదాద్రి జిల్లాలో భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు






● రూ.54 కోట్ల విలువైన 27 కిలోల మెఫెడ్రోన్ స్వాధీనం
● కొండమడుగు ల్యాబ్‌లో అక్రమ తయారీ.. నలుగురు అరెస్ట్, పలువురు పరారీ

**తొలివెలుగు, యాదాద్రి భువనగిరి జిల్లా:** యాదాద్రి భువనగిరి జిల్లాలో భారీ డ్రగ్స్ రాకెట్‌ను ఆదివారం పోలీసులు గుట్టురట్టు చేశారు. ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఆదేశాల మేరకు బీబీనగర్ పోలీసులు, ఎస్ఓటీ బృందం సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో రికార్డు స్థాయిలో రూ.54 కోట్ల విలువైన 27 కిలోల మెఫెడ్రోన్ మాదకద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కొండమడుగు శివారులోని వేటుకూరి ల్యాబ్స్‌లో అక్రమంగా మెఫెడ్రోన్ డ్రగ్‌ను తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. తయారు చేసిన మాదకద్రవ్యాన్ని ఫార్చ్యూనర్ కారులో మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు తరలిస్తుండగా పోలీసులు దాడి చేసి నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసులో చేతన్ మధుకర్, ముజామల్ హక్, ఆకాశ్, ల్యాబ్ ఇన్‌చార్జ్ రమణమూర్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ల్యాబ్ యజమాని రామరాజుతో పాటు మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. దాడుల సందర్భంగా ల్యాబ్‌లో డ్రగ్స్ తయారీకి ఉపయోగిస్తున్న పరికరాలతో పాటు సుమారు 40 కిలోల అసిటోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. మాదకద్రవ్యాల తయారీ, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ అక్షాంశ్ యాదవ్ హెచ్చరించారు. యువత భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాల దందాలో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# కలుషిత నీళ్లతో బేజారు



**తొలివెలుగు, హైదరాబాద్ :** ప్రజలను కలుషిత తాగునీరు కలవరపెడుతున్నది. గత కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జలమండలి వ్యాప్తంగా తాగునీరు సరఫరా అవుతున్నది. పలుచోట్ల నల్లా నీళ్లు మురుగు, దుర్వాసనతో వస్తుండటంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు కాలనీలు, బస్తీల ప్రజలు డయేరియా బారిన పడుతున్నామని వాపోతున్నారు. జలమండలి వ్యాప్తంగా వర్షాకాలం యాక్షన్ ప్లాన్ ప్రణాళికాబద్ధంగా, పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో క్షేత్రస్థాయిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జలమండలి పైపులైన్లకు లీకేజీలను ఎక్కడికక్కడ వదిలేస్తుండటంతో వరదనీరు, వర్షపునీరు కలుస్తూ మురుగునీళ్లు సరఫరా అవుతున్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం, జలమండలి అధికారుల అలక్ష్యంతో లీకేజీలను అరికట్టలేకపోతున్నారు. జలమండలి పరిధిని విస్తరించిన అధికారులు ఆయా ప్రాంతాల్లో నీటి సరఫరాను మాత్రం గాలికొదిలేశారని విలీన గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. విలీన గ్రామాలతో పాటు గ్రేటర్ వ్యాప్తంగా గత కొద్దిరోజులుగా కలుషిత నీటితో పాటు లోప్రెషర్, సరఫరాలో అంతరాయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ జోన్ పరిధిలోని పాతబస్తీ పరిధిలోని మెజార్టీ ప్రాంతాల్లో పైపులైన్ లీకేజీల వల్ల వర్షపునీరు జలమండలి నీటిలో కలిసి కలుషితమవుతున్నాయి. అదేవిధంగా పలు ప్రాంతాల్లో వర్షపు నీరు రోజుల తరబడిగా నిల్వ ఉండటంతో మురుగు చేరుతున్నది. ఖైరతాబాద్, కృష్ణానగర్, యూసుఫ్‌గూడ, బోరబండ, రహ్మత్‌నగర్, నందినగర్‌లో కలుషిత నీరు ప్రజలను వేధిస్తున్నది. మల్కాజిగిరి జోన్ పరిధిలోని నగర శివారు ప్రాంతాలైన బోడుప్పల్, కాప్రా, చిలుకనగర్, పీర్జాదిగూడలో నీటి కొరత వేధిస్తున్నది. దీనికి తోడు ఆయా ప్రాంతాల్లో రంగు మారిన నీళ్లు సరఫరా అవుతున్నాయని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. సైబరాబాద్ ప్రాతంలోని కొండాపూర్, ప్రేమ్‌నగర్, పాపారెడ్డి కాలనీ, నార్సింగి పరిధిలోని కోకాపేట, గండిపేట, మణికొండ, పుప్పాలగూడలో మురుగు నీరు సరఫరా అవుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**పాపిరెడ్డి కాలనీలో మూడేండ్లుగా మురుగునీరు**

శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్‌లోని పాపిరెడ్డి కాలనీ జలమండలి వినియోగదారులకు మూడేండ్లుగా మురుగు నీరు సరఫరా అవుతున్నది. కాలనీలో మూడు వందల మంది జలమండలి వినియోగదారులు ఉన్నారు. వర్షం పడితే నల్లానీళ్లు మురుగు, దుర్వాసనతో సరఫరా అవుతున్నాయి. ప్రతిరోజూ ఉదయం 5.30 గంటల నుంచి 6 వరకు వస్తాయి. మొత్తం మురుగు దుర్వాసనతో వస్తున్నాయి. లైన్‌మెన్‌లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. నిర్లక్ష్యపు సమాధానం చెప్తున్నారు. సంబంధిత మేనేజర్‌కు కాలనీ వాసులంతా ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన కరువవుతున్నది. ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు. ఇదే పరిస్థితి నగర వ్యాప్తంగా తాండవిస్తున్నది.



# యువత భవిష్యత్తు కోసం పోరాడాలి..

జీవితంలో వైఫల్యాలు అందరికీ ఉంటాయి. పెద్దదో, చిన్నదో అవి ఎదుర్కొంటారు. కానీ ఒక అఖండ విజయాన్ని పొందినప్పుడే సంయమనం అవసరం. జంతర్ మంతర్‌లో యువ బొద్దింకలది ఒక రకంగా అఖండ విజయమే. గత 12 ఏండ్ల నుంచి వ్యవస్థలను, వార్తా మాధ్యమాలను చేజిక్కించుకుని ప్రజలతో, వారి సంక్షేమంతో సంబంధం లేకుండా పరస్పర సంబంధాలు తుడిచేసి, ఏకాంకిక (ఏకపాత్రాభినయంలా) కేంద్రం పరిపాలన చేస్తున్న సమయంలో ప్రజల వ్యతిరేకతను ఇంత బాగా చూపించిన ఘనత మన వారసులదే! అయితే పైకి ఇది 'కంస సంహారం'లాగా కనిపించినా ఇక్కడ వైరిబలం తెలుసుకోవటం చాలా ముఖ్యం. ఒతర్ మంతర్ వద్ద ఉద్యమించిన కాక్రోచ్ పార్టీ ఆందోళనకారులపై పోలీసులు విరుచుకుపడ్డారు. మేకులు బిగించిన లాఠీలతో దాడి చేశారు. అక్కడ మోహరించిన బీజేపీ అనుకూల గుంపులు, గూండాలు నిరసనకారులను చితకబాదారు. ఇలాంటి వీడియోలు సోషల్ మీడియాలో పెద్దఎత్తున కనిపించాయి. పశు బలంతో, భయభ్రాంతులను చేసి, ప్రజలను పీడించిన వాళ్లు దేశభక్తులా? వీరి నాయకుడు విశ్వగురువా? మణిపూర్ మారణహోమం, క్రీడాకారిణులు చేసిన నిరసన ఎట్లా ముగిసింది? ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్‌భూషణ్‌కు పదవులు, అధికారం, సత్కారాలా? పూర్తి ఏడాదిపాటు రోడ్ల మీదే బతికి వ్యవసాయ నల్ల చట్టాలు వద్దని నిరసన తెలిపిన అన్నదాతలను బీజేపీ ఎట్లా పీడించింది? అన్నం తినేటప్పుడైనా రైతు విలువ గుర్తురావాలి కదా! ఇవన్నీ పైకి కనిపించిన ఘటనలు. చాపకింద నీరులా దేశ సంపద సంపన్నుల వైపు ప్రవహిస్తుంటే, నిరసన తెలిపేవారి గతి రోజూ చూస్తున్నాం. ఇవన్నీ ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే, ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అరాచకాలను ఏ స్థాయి వరకూ తీసుకెళ్తున్నదో అర్థం చేసుకోవడానికి. అందుకే ప్రస్తుతం ప్రభుత్వానికి ఎదురొడ్డి నిలుస్తున్న యువతకు వైరిబలం, వారి ప్రవర్తన అర్థం చేసుకోవడం చాలా అవసరం. యువత ఒక విషయం జాగ్రత్తగా గమనించాలి. ఏ ఉద్యమంలోనైనా ఒకే రకమైన ప్రణాళిక పాటించడం శ్రేయస్కరం కాదు. కష్టనష్టాలకోర్చి మొన్నటి నిరసనలాంటిది మళ్లీ చేస్తే దానిని చూడటం ప్రజలకు అలవాటయిపోతుంది ఏదైనా అలవాటయిపోయిన దాన్ని ప్రజలు పట్టించుకోరు. కాబట్టి జెన్–జీ సమయం, ధనం వెచ్చించాల్సింది కేంద్రానికి బలమున్న ఢిల్లీలో కాదు. ఎవరి రాష్ట్రంలో వారు ఆ రాష్ట్ర ప్రభుత్వ పాలనను ఎండగట్టాలి. అన్ని ఆన్‌లైన్ వేదికల మీద కూడా చర్చించుకోవచ్చు. రాష్ట్ర రాజధానులు, వివిధ నగరాల్లోనూఆందోళన కార్యక్రమాలు సాగించాలని యువతకు సూచన. ముఖ్యంగా అక్కడి సామాన్య ప్రజలను చైతన్యపర్చండి. ఇంకా ముఖ్యమైన విషయం. మీ రాష్ట్రంలో ఉన్నత విద్యావంతులు ప్రభుత్వంలో రిటైరైనవారు, విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు, డాక్టర్లు, లాయర్లు, ఇంకెవరైనా రాజకీయ అవగాహన ఉండి, ప్రజాహితం కోరే ఒక పదిమంది పెద్దవయసు వారిని మీ గ్రూపులకు ప్రత్యేక అతిథులుగా నియమించుకోండి. ఎందుకంటే, ఏ ఉద్యమానికైనా మీకున్న శక్తి, చైతన్యం, ఉత్సాహం, ధైర్యం ఎంత ముఖ్యమో, పెద్ద వయసువారికున్న జీవితానుభవం, రాజకీయ అవగాహన, పూర్వచరిత్ర జ్ఞానం, సంయమనం, సంతులత అంతే అవసరం. అయితే ముఖ్యంగా అందరూ పాటించవలసినది పరస్పర గౌరవం, అభిమానం, సమానత. అప్పుడు అది నిజమైన ప్రజాస్వామ్య సంస్థ అవుతుంది. ఎవరికి వారు తమ రాష్ట్రాల్లో నిరసన కార్యక్రమాలు చేయండి. ప్రతీ రాష్ట్రంలో తప్పక జరిగేటట్టు చూడండి. ఇప్పుడు మీ ముందున్నది ఒక్క అంశం కాదు. ప్రతీ రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, చర్యలను ఎండగట్టండి. ముఖ్యమైన రంగాలు విద్య, వైద్య, వ్యవసాయ, ఉద్యోగ, ఉపాధి కల్పన రంగాల గురించి క్షుణ్ణంగా అర్థం చేసుకోండి. వీలైనంత వరకు కార్పొరేట్, ప్రైవేట్ సంస్థలను విసర్జించండి. దేశంలో అన్ని రాష్ట్రాల్లో అలజడి వస్తే అన్నింటినీ నియంత్రించటం కేంద్రానికి కష్టమవుతుంది. ప్రభుత్వాలను, పార్టీలను దేశమంతా వ్యతిరేకిస్తున్నట్టు ఇతర దేశాలకు తెలుస్తుందనే భయముంటుంది.



# ప్రభుత్వ పెన్షనర్లకు ఆరోగ్య భద్రత ఏది?!

రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల సాధనకు ఈనెల 7 తేదీ ఉదయం పది గంటలకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద పెద్ద ఎత్తున మహాధర్నా నిర్వహించడానికి ఆ సంఘం నిర్ణయించింది. ఈ మేరకు సంఘం కార్యవర్గం సోమవారం సమావేశమైంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించాలని సంఘం రాష్ట్ర నేతలు సమావేశమై నిర్ణయించారు. సుదీర్ఘకాలం సేవలు అందించి, రిటైరైన ప్రభుత్వ ఉద్యోగులకు ఆరోగ్య భద్రతను ఇచ్చే ఎంప్లాయిస్ హెల్త్‌స్కీమ్ (ఈహెచ్ఎస్) సంక్షోభంలో పడింది. గత నెల 15న ఉద్యోగులతోపాటు రిటైర్డ్ ఉద్యోగులకు కూడా డిజిటల్ హెల్త్ కార్డులు ఇస్తామన్న కాంగ్రెస్ సర్కార్ చివరకు నిరాశే మిగిల్చింది. ఇంతవరకు నెట్‌వర్క్ దవాఖానలతో ఒప్పందాలు చేసుకోలేదు. కొత్త ఎంప్లాయి హెల్త్‌కేర్ ట్రస్ట్ (ఈహెచ్‌సీటీ) సేవలను ప్రభుత్వం ప్రతిపాదించిన ప్యాకేజీ ధరలతో సేవలు అందించలేమని తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ (టీఏఎన్‌హెచ్‌ఏ) తేల్చిచెప్పింది. అంతేకాకుండా ఈ కొత్త పథకం అమలుకు ముందే పాత ఈహెచ్ఎస్ పెండింగ్ బకాయిలు నెట్‌వర్క్ హాస్పిటల్స్‌కు చెల్లించాలని టీఏఎన్‌హెచ్‌ఏ డిమాండ్ చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో 2005 ఫిబ్రవరి 15న అప్పటి ప్రభుత్వం జీవో 74 విడుదల చేసింది. దీని ద్వారా ఉద్యోగి లేదా పెన్షనర్ తన చేతి నుంచి హాస్పిటల్‌కు చెల్లించిన లక్షల రూపాయలు రీయింబర్స్‌మెంట్ బిల్లుల ద్వారా సకాలంలో వచ్చే పరిస్థితి ఉండేది కాదు. ఒకవేళ రీయింబర్స్‌మెంట్ బిల్లు వచ్చినా అందులో సగం కట్ అయి రెండు లేదా మూడేండ్ల తర్వాత చేతికి అందేది. ఈ ఇబ్బందులన్నింటినీ దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గొప్ప నిర్ణయం తీసుకున్నారు. వృద్ధాప్యంలో అత్యంత కీలకమైనది ఆరోగ్యమని, పెన్షనర్లకే కాకుండా ఉద్యోగులందరికీ మేలు జరిగేలా కేసీఆర్ విశాల దృక్పథంతో 2023 అక్టోబర్ 8న కొత్త హెల్త్ స్కీమ్ జీవో 186ను జారీ చేశారు. ఈ పథకాన్ని వైద్య ఆరోగ్య శాఖ పకడ్బందీగా అమలుపరిస్తే రాష్ట్రంలోని లక్షలాది ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబాల్లో వెలుగులు నింపవచ్చునని కేసీఆర్ ఎంతో ఆకాంక్షించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి నేటివరకు రెండేండ్ల తొమ్మిది నెలలు గడిచినప్పటికీ బీఆర్ఎస్ హయాం నాటి జీవో 186లో కొన్ని మార్పులు చేసింది. అయినా దానిని ఇంతవరకు పకడ్బందీగా అమలు చేసిన దాఖలాలు లేవు. కానీ ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి హెల్త్ కార్డుల కోసం

**రాష్ట్ర ప్రభుత్వం ప్రీమియం కట్ చేస్తున్నది.**

ఈ ఏడాది ఫిబ్రవరి 12న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన అధికారులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం జరిగింది. నగదు రహిత వైద్యం విషయంలో వచ్చిన అభిప్రాయాలకు అనుగుణంగా ఉద్యోగుల మూలవేతనం నుంచి, రిటైర్డ్ ఉద్యోగుల బేసిక్ నుంచి నెలకు 1.5 శాతం రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేసిన హెల్త్‌ట్రస్టుకు అందించడానికి ఆ సమావేశంలో అంగీకారం కుదిరింది. ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల నుంచి వసూలు చేసిన మొత్తంతో సమానంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వాటా చెల్లించడానికి ఒప్పందం జరిగింది. కానీ ఉద్యోగులు, పెన్షనర్లకు డిజిటల్ హెల్త్ కార్డులు ఇవ్వకముందే, దవాఖానల యాజమాన్యాల అంగీకారం పొందకముందే ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి ఈ ఏడాది మే, జూన్ నుంచి 1.5 శాతం వంతున రాష్ట్ర ప్రభుత్వం మినహాయించుకున్నది. అయితే, ఆ మొత్తం ఎంప్లాయిస్ హెల్త్‌కేర్ ట్రస్ట్ (ఈహెచ్ఎస్‌సీటీ) ఖాతాల్లోకి బదిలీ అయినట్లు సమాచారం లేదు. ఇది ఎంతవరకు న్యాయం? సర్కార్ చెప్పిన తేదీ గత నెల 15 నాటికి హెల్త్ కార్డులు ఇవ్వకపోవడం పట్ల పలువురు ఉద్యోగులు, పెన్షనర్ల సంఘాల నేతలు, ఎంప్లాయిస్ హెల్త్‌కేర్ ట్రస్ట్ సభ్యులు సీఎస్‌ను కలిసి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సీజీహెచ్ఎస్ టారిఫ్‌లో కొత్త ఈహెచ్‌సీటీ సేవలు అందించలేమంటూ తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది. ప్రతిపాదిత ప్యాకేజీ ధరలో ప్రస్తుత ఆరోగ్యశ్రీ, గత ఈహెచ్ఎస్ ప్యాకేజీ ధరల కంటే తక్కువగా ఉన్నాయని తెలిపింది. ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ప్రైవేటు దవాఖానలకు ఆర్థికంగా తీవ్ర నష్టం తప్పదని వాపోయారు. ప్యాకేజీల్లో శాస్త్రీయత ఉంటేనే రేట్లు ఫిక్స్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన సూచించారు. రాష్ట్రంలో 2024 ఏప్రిల్ తర్వాత రిటైరైన ఉద్యోగుల్లో సుమారు 10 వేల మందికి పైగా బెనిఫిట్స్ రాక నానా అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా ఉద్యోగులు, పెన్షనర్లకు 2024 జనవరి నుంచి ఆరు డీఏ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటు కొత్త పీఆర్‌సీ మంజూరు కాక, ఇటు డిజిటల్ హెల్త్‌కార్డులు రాక రాష్ట్రవ్యాప్తంగా 7.8 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు ఆవేదన చెందుతున్నారు. దీనికితోడు ఇప్పటికీ కొత్త హెల్త్ కార్డులు డౌన్‌లోడ్ కాకపోవడంతో సవాలక్ష సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను సత్వరం పరిష్కరించాల్సిన అవసరం ఎంతో ఉన్నది. రిటైర్డ్ ఉద్యోగులు ఈనెల7న మహాధర్నాకు పిలుపునిచ్చిన నేపథ్యంలో సమస్యను మరింత జఠిలం చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నెట్‌వర్క్ హాస్పిటల్స్‌తో మరొకసారి సమావేశం ఏర్పాటు చేసి, వారి ఇబ్బందులను పరిష్కరించాలి.



# బీజేపీకి ఎదురుగాలి

దేశంలోని మూడు రాష్ట్రాల్లో ఇటీవల మూడు అసెంబ్లీ సీట్లకు ఉపఎన్నికలు జరిగాయి. ఈ మూడుచోట్లా మూడు వేర్వేరు పార్టీలు గెలిచాయి. స్థూల దృష్టికి ఇది సాధారణ విషయంలా అనిపించవచ్చు. కానీ ఈ ఫలితాలకు ఓ ప్రత్యేకత ఉన్నది. ఇవి దేశంలో మారుతున్న లేదా చాలావరకు మారిపోయిన రాజకీయ దృశ్యాన్ని మనకు చూపిస్తున్నాయి. పన్నెండేండ్ల పైచిలుకు కాలంగా కేంద్రంలో సాగుతున్న ఎన్డీయే అప్రతిహత పాలనకు ఇవి ప్రమాద ఘంటికలు మోగించాయని మాత్రం చెప్పవచ్చు. మొదటిది, నితీశ్‌కుమార్‌ను తప్పించి బీజేపీ అధికార పగ్గాలు చేపట్టిన బీహార్‌లో సుప్రసిద్ధ ఎన్నికల విశ్లేషకుడు, జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ బాంకీపుర్ ఉపఎన్నికలో సాధించిన అనూహ్య విజయం. పాలకపక్ష అభ్యర్థిపై 19 వేల ఆధిక్యంతో ఆయన గెలుపొందారు. బీజేపీ కంచుకోట బద్దలు చేశాడంటూ ఆయనపై ప్రశంసలు కురుస్తుండటం గమనార్హం. రెండోది, గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారం దక్కించుకున్న మధ్యప్రదేశ్‌లోని దతియా నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఘన్‌శ్యామ్ సింగ్ బీజేపీ అభ్యర్థి అశుతోష్ తివారీపై 6 వేల ఓట్లతో గెలువడం. మూడోది, గుజరాత్‌లోని మంజల్‌పూర్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి సతీశ్ గోవింద్‌భాయ్ పటేల్‌ను 30 వేల మెజారిటీతో ఓడించడం. దేశం ఎంతో ఆసక్తిగా గమనించిన ఈ మూడు ఉపఎన్నికల ఫలితాలు నిర్ణాయకమైనవి కాకపోవచ్చు గానీ, ఓటర్ల ఆలోచనలో వచ్చిన మార్పునకు, బీజేపీకి వీస్తున్న ఎదురుగాలికి అవి అద్దం పడుతున్నాయని మాత్రం చెప్పవచ్చు. పై మూడు ఫలితాల్లో ప్రశాంత్ కిశోర్ విజయం గురించే ఎక్కువగా చర్చ జరుగడానికి పలు కారణాలు ఉన్నాయి. ఆయన గెలిచిన బాంకీపుర్ నియోజకవర్గం బీజేపీకి ప్రతిష్ఠాత్మకమైందని చెప్పాల్సిన పనిలేదు. పైగా అది ఆ పార్టీ జాతీయ అధ్యక్షునిగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన నితిన్ నబీన్ రాజ్యసభకు వెళ్లడంతో ఖాళీ అయ్యింది కావడం, ఉపఎన్నికలో అధికార పార్టీ గెలువడం అనే ఆనవాయితీకి విరుద్ధంగా ఫలితం రావడం గమనార్హం. 31 సంవత్సరాలుగా గెలుస్తున్న స్థానం కోల్పోవడం అనేది పాలకపక్షానికి ఓ సంకేతం. గత ఎన్నికల్లో ఏమాత్రం ప్రభావం చూపని జన్ సురాజ్ పార్టీ నేత భారీ మెజారిటీతో గెలువడం ఓటర్ల దృక్పథంలో వచ్చిన కచ్చితమైన మార్పును సూచిస్తున్నది. మధ్యప్రదేశ్‌లోనూ పాలక బీజేపీకి చుక్కెదురు కావడం మరో సంకేతం. ఇక సంప్రదాయికంగా బీజేపీ రాష్ట్రంగా కొనసాగుతున్న గుజరాత్‌లో అధికారపక్ష అభ్యర్థి గెలిచినప్పటికీ 2022లో వచ్చిన లక్ష ఓట్ల ఆధిక్యం కాస్తా 30 వేలకు పడిపోవడం పార్టీ బలం సన్నగిల్లిందనడానికి నిదర్శనం ఏ రకంగా చూసినా ఈ మూడు ఫలితాలు బీజేపీకి, ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీకి కునుకు లేకుండా చేసేవిగానే ఉన్నాయి. ఓటర్లు ప్రత్యామ్నాయాల వైపు, ప్రయోగాల వైపు చూస్తున్నారని ఈ మూడుచోట్ల వెలువడిన ఫలితాలు తేటతెల్లం చేస్తున్నాయి. బీజేపీ సహా బీహార్‌లో పాతుకుపోయిన పార్టీలకు వారు అంతగా ప్రాముఖ్యం ఇవ్వలేదు. బాంకీపుర్‌లో తాము 'కుక్కను నిలబెట్టినా, పిల్లిని పోటీకి పెట్టినా' గెలుపు తమదేనని విర్రవీగిన బీజేపీకి ఓటర్లు గట్టి గుణపాఠం చెప్పారు. ఢిల్లీలో జెన్–జీ ఆందోళన ఫలితంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, అయోధ్య రామాలయంలో విరాళాల చోరీపై ఉధృత స్థాయిలో దర్యాప్తు జరుగుతున్న నేపథ్యంలో ఈ ఉపఎన్నికలు జరిగాయనేది గుర్తుంచుకోవాలి. బీజేపీకి ఇన్నాళ్లూ అండగా నిలిచిన వర్గాలు దూరమవుతున్నాయని ఫలితాలు తెలియజేస్తున్నాయి. మతపరమైన విభజన రాజకీయాలు, ప్రగతి, సంక్షేమాలను పక్కనబెట్టి కార్పొరేట్ల కొమ్ముకాసే విధానాల పట్ల ఓటర్లలో విముఖత ఏర్పడింది. ప్రజల బాగోగులు పట్టించుకునే రాజకీయాలు కావాలన్న ప్రశాంత్ కిశోర్ వైపు ఓటర్లు మొగ్గడం విశేషం




# ఫండ్స్‌లో పెట్టుబడులకు గిఫ్ట్ కార్డులు

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడుల దిశగా మరింత మంది ఇన్వెస్టర్లను ప్రోత్సహించేందుకు సెబీ.. గిఫ్ట్ కార్డులు లేదా గిఫ్ట్ ప్రీ పెయిడ్ పేమెంట్ ఇన్‌స్ట్రుమెంట్లను (పీపీఐలు) ప్రతిపాదించింది. దీని ప్రకారం ఎవరైనా సరే గిఫ్టీపీపీఐలను కొనుగోలు చేసి వేరొకరికి కానుకగా ఇవ్వొచ్చు. ఈ గిఫ్ట్ పీపీఐలను స్వీకరించిన వారు వాటితో తమకు నచ్చిన మ్యూచువల్ ఫండ్ పథకంలో యూనిట్లను కొనుగోలు చేసుకోవచ్చు. ఈ ప్రతిపాదనపై సలహాలు, సూచనలను ఏప్రిల్ 14లోపు తెలియజేయాలని సెబీ కోరింది. గిఫ్ట్ పీపీఐలను ఎలక్ట్రానిక్ బ్యాంక్ ట్రాన్స్‌ఫర్ లేదా యూపీఐ ద్వారా కొనుగోలు చేసుకోవచ్చు. వీటి కాల వ్యవధి ఏడాదిగా ఉంటుంది. గిఫ్ట్ పీపీఐ ద్వారా ఒక్కో ఇన్వెస్టర్ ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.50,000 వరకు ఇన్వెస్ట్ చేసుకోవచ్చని సెబీ పరిమితి పెట్టింది. గిఫ్ట్ పీపీఐలను అనుమతించాలంటూ మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ చేసిన వినతి మేరకు సెబీ ఈ చర్యకు ఉపక్రమించింది. రిటైల్ కొనుగోళ్లకు సంబంధించి గిఫ్ట్ కార్డులు ఎంతో ప్రాచుర్యం పొందడం తెలిసిందే. ఇప్పుడు వీటిని పెట్టుబడుల వైపు మళ్లించేందుకు సెబీ నిర్ణయం తోడ్పడనుంది.

# ఐదేళ్లలో బంగారం మార్క్.. నిపుణుల కొత్త అంచనా!



పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ మేఘాలు, అంతర్జాతీయ రాజకీయ ఉద్రిక్తతల కారణంగా బంగారం ధరల్లో చాలా మార్పులు జరిగాయి. చాలామంది పెట్టుబడిదారులు విలువైన లోహాలపై పెట్టుబడులు పెడుతున్నారు. ఈ తరుణంలో ఫండ్స్ఇండియా గ్రూప్ సీఈఓ అక్షయ్ సప్రూ భవిష్యత్ పరిణామాల గురించి విశ్లేషించారు. భౌగోళిక రాజకీయ పరిణామాలను నియంత్రించడం చాలా కష్టం. ఇలాంటి సంఘటనలు గతంలో కూడా చాలా జరిగాయి. భవిష్యత్తులోనూ జరిగే అవకాశం ఉంది. కాబట్టి ఇలాంటి సంఘటనల కారణంగా.. పెట్టుబడిదారుడి తత్వం దారి తప్పకూడదని అక్షయ్ పేర్కొన్నారు. ఇన్వెస్టర్లు ప్రస్తుతం పాత పద్ధతులను వదిలిపెట్టి.. కొత్త విధానాలను అనుసరిస్తున్నారని అన్నారు. బంగారం ర్యాలీ చాలా వరకు పూర్తయింది. రాబోయే ఐదేళ్లలో.. ఇది గత సైకిల్ మాదిరిగా రాబడులను అందించకపోవచ్చు. మీ పోర్ట్‌ఫోలియోలో బంగారం ఇప్పటికే 5-10 శాతం ఉంటే, ఆ కేటాయింపును కొనసాగించవచ్చు, కానీ పెట్టుబడిని గణనీయంగా పెంచడం మంచిది కాదు. గోల్డ్ సిప్‌లను కొనసాగించవచ్చు, కానీ కొత్తగా చేసే ఏకమొత్తం పెట్టుబడుల విషయంలో జాగ్రత్త వహించాలి. వెండి విషయానికొస్తే, దాని అధిక అస్థిరత, నిలకడలేని రాబడుల కారణంగా సాధారణంగా చాలామంది దానికి ప్రాధాన్యత ఇవ్వరు అని అక్షయ్ సప్రూ పేర్కొన్నారు.ఇప్పుడు రూ.1,48,000 వద్ద బంగారం ధర 2030 నాటికి రూ.1.68 లక్షల నుంచి రూ. 2.25 లక్షల మధ్యకు చేరుకుంటుందని మరికొందరు నిపుణులు అంచనా వేస్తున్నారు. గోల్డ్ రేటు పెరగడానికి ప్రధాన కారణం సెంట్రల్ బ్యాంకుల భారీ కొనుగోళ్లు మాత్రమే కాకుండా ప్రపంచ దేశాల్లో ఏర్పడే ఆర్థిక అనిశ్చితి అని చెబుతున్నారు.

## ఎగుమతులు షురూ.. 75 దేశాలకు సెమాగ్లూటైడ్!

మధుమేహం, ఊబకాయం చికిత్సలో ఉపయోగించే సెమాగ్లూటైడ్ ఇంజెక్షన్ జనరిక్ వెర్షన్ల ఎగుమతులను ప్రారంభించినట్లు హెటిరో వెల్లడించింది. ట్రూగ్లిక్స్, రోల్‌మోడల్, మోటో జీ బ్రాండ్ల పేరుతో వీటిని విక్రయించనున్నట్లు వివరించింది. ఇవి డిస్పోజబుల్ పెన్ డివైజ్‌ల రూపంలో 0.25 ఎంజీ నుంచి 2.4 ఎంజీ వరకు వివిధ డోసేజీల్లో లభిస్తాయి. 75 పైగా దేశాలకు దశలవారీగా వీటిని ఎగుమతి చేయనున్నట్లు కంపెనీ తెలిపింది. ముందుగా ఆఫ్రికా, ఆసియా, పశ్చిమాసియా దేశాల్లో అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించింది. నియంత్రణ సంస్థ సీడీఎస్‌సీవో అనుమతులు వచ్చాక దేశీయంగా కూడా దీన్ని ప్రవేశపెట్టనున్నట్లు సంస్థ పేర్కొంది. వర్ధమాన మార్కెట్లలో అందుబాటు ధరలో నాణ్యమైన జనరిక్ సెమాగ్లూటైడ్‌ని అందించాలనేది తమ లక్ష్యమని హెటిరో ఎండీ వంశీకృష్ణ బండి తెలిపారు.



# కొత్త కార్ల సందడి.. విడుదలకానున్న ఐదు మోడళ్లు

న్యూఢిల్లీ, దేశీయ ఆటోమొబైల్ రంగంలోకి మరిన్ని నూతన కార్లు రావడానికి సిద్ధమవుతున్నాయి. కొత్తగా ఐదు విడుదల చేయబోతున్నట్టు దేశీయ, అంతర్జాతీయ వాహన సంస్థలు ప్రకటించాయి. వీటిలో ఫోక్స్‌వ్యాగన్, ఎంజీ, మెర్సిడెజ్ బెంజ్, టయోటా, నిస్సాన్‌లు ఉన్నాయి. ఒకవైపు ధరలు పెంచుతున్నప్పటికీ, మరోవైపు, నూతన వాహనాలను విడుదల చేయబోతున్నాయి. వీటిలో ఇప్పటికే పలు మాడళ్లను ప్రదర్శించాయి కూడా.




**ఫోక్స్‌వ్యాగన్ టైగూన్**

ఫోక్స్‌వ్యాగన్ మరో నయా మాడల్‌ను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేయబోతున్నది. ఐదేండ్ల తర్వాత టైగూన్ నయా మాడల్‌ను విడుదల చేస్తున్నది. 2021లో ఈ ఎస్‌యూవీని విడుదల చేసిన సంస్థ. .ప్రస్తుతం ఈ మాడల్‌ను ఆధునీకరించి, ముఖ్యంగా కొనుగోలుదారులు కోరుకుంటున్న విధంగా పలు మార్పులు చేసినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. 1.0 లీటర్ పెట్రోల్ ఇంజిన్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్ కలిగిన ఈ మాడల్‌లో ఎనిమిది గేర్లు ఉండనున్నాయి.

**బెంజ్ సీఎల్‌ఏ మాడల్**

జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల సంస్థ మెర్సిడెజ్-బెంజ్ మరో ఎలక్ట్రిక్ మాడల్‌ను తీసుకురాబోతున్నది. వచ్చే నెలలో సీఎల్‌ఏ ఎంట్రీ-లెవల్ ఈవీ సెడాన్‌ను ప్రవేశపెట్టబోతున్నట్టు ప్రకటించింది. సింగిల్ చార్జింగ్‌తో 792 కిలోమీటర్లు ప్రయాణించే ఈ మాడల్‌లో 14 ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, గ్లాస్ రూఫ్ వంటి ఫీచర్స్‌తో తీర్చిదిద్దింది. ఈ కారు ధర రూ.55 లక్షల నుంచి రూ.59 లక్షల మధ్యలో ఉంటుందని అంచనా.

**టయోటా అర్బన్ క్రూజర్**

టయోటా కంపెనీ మరో ఈవీ మాడల్ అర్బన్ క్రూజర్‌ను ప్రవేశపెట్టబోతున్నది. 40 కిలోవాట్లు, 61 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్‌తో లభించనున్న ఈ కారు సింగిల్ చార్జింగ్‌తో 543 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. బ్యాటరీ-యాస్-ఏ-సర్వీసెస్(బాస్) ప్రొగ్రాం పద్ధతిన ఈ మాడల్‌ను ప్రవేశపెడుతున్నది.

**నిస్సాన్ టెక్టాన్**

నిస్సాన్ మరో ఎస్‌యూవీని విడుదల చేయబోతున్నది. రెనో డస్టర్‌కు ప్రత్నామ్నాయంగా టెక్టాన్‌ను తీసుకొస్తున్నది.

# తీవ్ర సంక్షోభం తప్పదు.. కియోసాకి హెచ్చరిక



ప్రముఖ ఆర్థిక నిపుణుడు, 'రిచ్ డాడ్ పూర్ డాడ్' (=అఎష్ట్ర ఖుఽ ౹ాశీశీ ఖుఽ) రచయిత రాబర్ట్ కియోసాకి ఆర్థిక ప్రణాళికపై మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా ఆర్థిక పరిస్థితి, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, స్టాక్ మార్కెట్ ఒడిదుడుకులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా వృద్ధాప్యంలో ఉన్నవారు ఆర్థిక క్రమశిక్షణ పాటించకపోతే ఎదురయ్యే పరిణామాలను ఆయన తన తాజా సోషల్ మీడియా పోస్ట్‌లో వివరించారు.

**నిర్లక్ష్యం.. నిశ్శబ్ద శత్రువు!**

తన కుటుంబ సభ్యురాలితో జరిగిన ఒక చర్చను ఉదహరిస్తూ.. "చాలా మంది ప్రస్తుత ఆర్థిక సంక్షోభాన్ని గుర్తించడం లేదు" అని కియోసాకి (=శీఎవతీ ఖఱఎశీఝఎఱ) ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 80 ఏళ్ల వయస్సు ఉండి, ఎటువంటి పొదుపు లేకుండా, ఇప్పటికీ పని చేయాల్సిన పరిస్థితిలో ఉన్నప్పటికీ.. చాలామంది "ఏం పర్వాలేదు.. సంతోషంగా ఉంటే చాలు (ణశీత్' ఞశీతీతీఎ, ఎవ ఢ్ణుజూజూఎ)" అనే ధోరణిలో ఉండటం ప్రమాదకరమని ఆయన పేర్కొన్నారు.

**యువతకు విలువైన హెచ్చరిక**

ఆర్థిక సంక్షోభం ఎప్పుడైనా రావచ్చని, దాన్ని ఎదుర్కోవడానికి యువతకు ఉన్న అతిపెద్ద ఆస్తి "సమయం" అని ఆయన గుర్తు చేశారు. సమయం, ఆరోగ్యం.. ఇవే మనిషికి ఉన్న గొప్ప ఆస్తులు. వీటిని వృథా చేయకుండా పెట్టుబడిగా మార్చుకోవాలి.తాను 28 ఏళ్ల వయస్సులో ఇల్లు లేకుండా, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానని.. కానీ ఆ వయస్సులో తాను నేర్చుకున్న పాఠాలే నేటి ఆర్థిక సవాళ్లను ఎదుర్కోవడానికి సహాయపడుతున్నాయని ఆయన వివరించారు.

**ప్రస్తుత పరిస్థితులు ఆందోళనకరం!**

ప్రపంచ దేశాల్లో ముద్రిస్తున్న 'నకిలీ కరెన్సీ' (ఫేక్ మనీ), పెరుగుతున్న జాతీయ అప్పులు, స్టాక్ మార్కెట్ కుప్పకూలే అవకాశాలను విస్మరించడం తెలివైన పని కాదని కియోసాకి హెచ్చరించారు. వయస్సు పెరిగే కొద్దీ కొత్తగా సంపాదించే సామర్థ్యం తగ్గుతుందని, అందుకే యువత తమ సమయాన్ని తెలివిగా ఖర్చు చేయాలని ఆయన సూచించారు.

# జేబులో జ్యూసర్.. బాటిల్ బ్యాగ్: ఇవిగో సమ్మర్ గ్యాడ్జెట్స్



మీ సమ్మర్‌ను రిఫ్రెషింగ్‌గా మార్చే 'స్మార్ట్' మ్యాజిక్ ఇదిగో! ఈ అదిరిపోయే గాడ్జెట్స్‌తో చెమటలకు గుడ్ బై చెప్పేసి, చిల్ అవ్వండి!ఆఫీసులో ఉన్నప్పుడైనా లేదా జిమ్ పూర్తి చేసొచ్చినా, బయట దొరికే షుగర్ డ్రింక్స్ తాగి విసిగిపోయారా? ఎక్కడున్నా సరే 'ఫ్రెష్'గా జ్యూస్ చేసుకోవాలనుకుంటున్నారా? ఇందుకోసమే వచ్చేసింది ఈ రీచార్జబుల్ పోర్టబుల్ జ్యూసర్! ఇది మామూలు మిక్సీ కాదు, మీరు ఎక్కడికి వెళ్లినా వెంట తీసుకెళ్లగలిగే ఒక మినీ మ్యాజిక్ బాటిల్! పైగా దీనికి వైర్లు లేదా ప్లగ్ పాయింట్లతో పనిలేదు. ఇందులో ఉన్న పవర్‌ఫుల్ బ్యాటరీని మీ మొబైల్ చార్జర్ లేదా పవర్ బ్యాంక్‌తో చార్జ్ చేసుకుంటే చాలు. ప్రయాణాల్లో ఉన్నా, క్యాంపింగ్‌లో ఉన్నా సెకన్లలో తాజా ఫ్రూట్ జ్యూస్‌లు, స్మూతీలు రెడీ అయిపోతాయి. జ్యూసర్ లీక్--ప్రూఫ్ డిజైన్‌తో వస్తుంది, కాబట్టి మీ బ్యాగ్‌లో పెట్టుకున్నా చిందుతుందనే భయం ఉండదు. ధర రూ. 570 మాత్రమే! బయటకి వెళ్ళినప్పుడు వాటర్ బాటిల్‌ను చేత్తో పట్టుకోలేక, బ్యాగ్‌లో పెడితే లోపల ఉన్న వస్తువులు తడిసిపోతాయని టెన్షన్ పడుతున్నారా? ఇకపై మీ బాటిల్‌ను స్టయిలిష్‌గా మోసుకెళ్లడానికి వచ్చేసింది ఈ వాటర్ బాటిల్ క్యారియర్ బ్యాగ్! ఇందులో బాటిల్‌తో పాటు మీ ఫోన్, డబ్బులు లేదా తాళాలు పెట్టుకోవడానికి ఒక జిప్పర్ పాకెట్ కూడా ఉంటుంది. పైగా దీనికి ఉన్న అడ్జస్టబుల్ షోల్డర్ స్ట్రాప్ వల్ల ఎవరికైనా ఇట్టే సెట్ అయిపోతుంది. వాటర్ ప్రూఫ్ మెటీరియల్‌తో తయారు చేయడం వల్ల వర్షం పడినా మీ ఫోన్, బాటిల్ సేఫ్‌గా ఉంటాయి! ఆఫీసుకైనా, జిమ్‌కైనా లేదా ట్రావెలింగ్‌కైనా ఈ బ్యాగ్ మీకు మంచి క్లాసీ లుక్‌ను ఇస్తుంది. ఫ్రిజ్‌లో ఉన్న ఐస్ ట్రే నుంచి ఐస్ ముక్కల్ని తీయడానికి కుస్తీ పడుతున్నారా? తీరా తీశాక అవి అక్కడక్కడా విరిగిపోయి చిరాకు తెప్పిస్తున్నాయా? అయితే మీకోసం వచ్చేసింది ఈ సిలికాన్ ఐస్ మేకర్ కప్పు!ఇది మామూలు ఐస్ ట్రే కాదు, ఒక స్మార్ట్ సిలికాన్ సిలిండర్. ఇందులో నీళ్లు పోసి ఫ్రిజ్‌లో పెట్టుకుని ఐస్ తయారు చేసుకోవచ్చు. దీనికున్న చిన్న బటన్ నొక్కితే చాలు, అరవై చిన్న చిన్న ఐస్ ముక్కలు టకటకా రాలిపోతాయి! చూడటానికి కప్పులా చాలా చిన్నగా ఉంటూ, మీ ఫ్రిజ్‌లో అస్సలు చోటు ఆక్రమించదు.

# బిగ్ షాక్.. భారత్‌లో దోహా బ్యాంక్ పూర్తిగా క్లోజ్!

భారతదేశంలో పదేళ్లకు పైగా తన కార్యకలాపాలను సాగించిన దోహా బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగానే.. కటార్‌లోని దోహా బ్యాంక్ తన భారత్‌లోని రెండు శాఖలను మూసివేయాలని నిర్ణయించింది. కాగా ఇకపై కేవలం ఒక ప్రతినిధి కార్యాలయాన్ని మాత్రమే కొనసాగించనుంది. ఈ విషయాన్ని బ్యాంక్ ఒక ప్రకటన ద్వారా వెల్లడించింది. దోహా బ్యాంక్ భారతదేశంలో తన కార్యకలాపాలను జూన్ 2014 లో ప్రారంభించింది. మొదటి శాఖ ముంబైలో, తరువాత కొచ్చిలో రెండవ శాఖ ప్రారంభించింది. ఆ తరువాత 2016లో ఈ బ్యాంక్ భారతీయ మార్కెట్‌లో వృద్ధి చెందుతున్న ఆర్థిక పరిస్థితులను ఉపయోగించుకుని, గల్ఫ్ దేశం, భారతదేశం మధ్య రిమిటెన్స్ (ప్యారమిటెన్స్) అవకాశాలను లబ్ధిపరచడానికి ఇండియాలో సబ్సిడియరీ స్థాపించేందుకు అనుమతి కోసం ప్రయత్నిస్తుందని వార్తలు వచ్చాయి.ఇప్పుడు దోహా బ్యాంక్ వ్యూహం మార్పుతో.. భారతదేశంలో ప్రత్యక్ష కార్యకలాపాలను తగ్గిస్తూ, ప్రతినిధి కార్యాలయం ద్వారా మాత్రమే తన ఉనికిని కొనసాగించనున్నది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే.. డబ్బులు జమ చేసుకోవడం విత్‌డ్రా చేయడం వంటివి ఇకపై ఉండదు. అయితే ఇది ఖతార్‌లోని ప్రధాన బ్యాంకుకు, భారతీయ కస్టమర్లకు మధ్య ఒక వారధిలా మాత్రమే పనిచేస్తుంది. అంటే వ్యాపార అవకాశాలను వెతకడం, దీనికి సంబంధించిన సమాచారాన్ని పంచుకోవడం వంటి పనులకు మాత్రమే ఇది పరిమితమై ఉంటుందన్నమాట.


# మరో కారు లాంచ్ చేసిన బీవైడీ: ధర ఎంతంటే?

చైనా కార్ల తయారీ సంస్థ బీవైడీ.. అట్టో 1 ఎలక్ట్రిక్ హ్యాచ్‌బ్యాక్‌ను '2026 బ్యాంకాక్ అంతర్జాతీయ మోటార్ షో'లో లాంచ్ చేసింది. దీని ధరలు భారతీయ కరెన్సీ ప్రకారం రూ.12.29 లక్షల నుంచి రూ. 13.15 లక్షలు.Advertisementబీవైడీ అట్టో 1 ఎలక్ట్రిక్ కారు.. ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉన్న సాధారణ అట్టో కంటే భిన్నంగా ఉంది. ఇది క్లోజ్డ్ గ్రిల్, ఎయిర్ వెంట్లు, రెట్రో-స్టైల్ డోర్ హ్యాండిల్స్, 16 ఇంచెస్ అల్లాయ్ వీల్స్, కుడి వైపు ఫ్రంట్ క్వార్టర్ ప్యానెల్‌పై ఛార్జింగ్ ఫ్లాప్, కనెక్టెడ్ టెయిల్ లైట్, షార్క్-ఫిన్ యాంటెన్నా, ఇంటిగ్రేటెడ్ స్పాయిలర్ వంటివి పొందుతుంది.ఇంటీరియర్ విషయానికి వస్తే.. ఇది 7 అంగుళాల ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, వైర్‌లెస్ కనెక్టివిటీతో కూడిన 10.1-అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, అడ్జస్టబుల్ స్టీరింగ్, వైర్‌లెస్ ఛార్జింగ్, నాలుగు డిస్క్ బ్రేకులు, మూడు రాడార్లతో కూడిన రియర్-వ్యూ కెమెరా మొదలైనవి ఉన్నాయి.బీవైడీ అట్టో 1 ఎలక్ట్రిక్ కారు 38.88kWh బ్లేడ్ LFP బ్యాటరీ ప్యాక్‌తో 380 కిమీ రేంజ్ అందిస్తుంది. ఇందులోని ఎలక్ట్రిక్ మోటారు 74 దీhp పవర్, 135 దీఎ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది.



## సందేశంతో ఓ అందాల రాక్షసి

స్వీయ దర్శకత్వంలో షెరాజ్ మెహదీ హీరోగా నటించిన చిత్రం 'ఓ అందాల రాక్షసి'. స్కై ఈజ్ ది లిమిట్ స్టూడియోస్ పతాకంపై సురీందర్ కౌర్ నిర్మించారు. గతంలోనే ఈ సినిమా విడుదలైంది. తాజాగా ప్రేక్షకుల అభ్యర్థన మేరకు ఈ చిత్రాన్ని ఈ నెల 24న రీరిలీజ్ చేస్తున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా ఇటీవల మీడియా సమావేశాన్ని నిర్వహించారు. మహిళా ప్రధాన చిత్రమిదని, చక్కటి సందేశంతో ఆకట్టుకుంటుందని, సమాజంలో అమాయక మహిళలు ఎలా మోసపోతున్నారనే అంశాన్ని చూపించడంతో పాటు మోసాలకు పాల్పడేవారికి శిక్ష తప్పదనే సందేశాన్ని కూడా అందించామని మేకర్స్ తెలిపారు. విహాన్షి హెగాడే, కృతివర్మ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం, దర్శకత్వం: షెరాజ్ మెహదీ.



## వ్యసనం.. ఓ మానసిక రోగం

ఏ వ్యసనమైనా విలాసం కాదనీ, అది ఓ మానసిక రోగమని అంటున్నది బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్. షూటింగ్‌లతో ఎప్పుడూ బిజీగా ఉండే జాన్వీ.. సామాజిక అంశాలపైనా బాధ్యతతో వ్యవహరిస్తుంటుంది. మద్యపానం, దాని వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తుంటుంది. ఇటీవల ఓ స్వచ్ఛంద సంస్థతో కలిసి.. మద్యపానంపై ఓ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నది. ఈ సందర్భంగా మద్యపానం, దాని వల్ల కలిగే ఇబ్బందుల గురించి కీలక వ్యాఖ్యలు చేసింది. "మద్యానికి బానిసలైన వ్యక్తులను, వారి వ్యక్తిత్వాన్ని ఎవరూ తక్కువ చేయొద్దు. నిజానికి మద్యపానంతో పాటు ఏ వ్యసనమైనా.. చెడు అలవాటు కాదు. ఒక మానసిక సమస్య మాత్రమే. ఒత్తిడి, బాధలు, వ్యక్తిగత సమస్యల వల్లే చాలామంది వాటికి అలవాటు పడతారు. అలాంటివారిని నేరస్తుల్లా కాకుండా.. రోగుల్లా చూడాలి. వారిని విమర్శించడం, దూరంగా ఉంచడం వంటివి చేయొద్దు. వారికి ప్రేమను పంచాలి. తోటివారి నుంచి సానుభూతి, మద్దతు లభిస్తేనే అలాంటి వారు త్వరగా మారతారు" అంటూ చెప్పుకొచ్చింది జాన్వీ. మద్యపానం తన జీవితంపైనా ప్రభావం చూపిందని వెల్లడించింది. "నేను కూడా అప్పుడప్పుడూ మద్యం తీసుకునేదాన్ని. కానీ, కొన్నిరోజులకు నాకు తెలియకుండానే దానికి బానిసగా మారిపోయా! వ్యసనం అంటే మనతో ఎవరో అపరిచిత వ్యక్తి ఉనట్టే అనిపిస్తుంది. మన ప్రవర్తన పూర్తిగా మారిపోతుంది. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కూడా జాగ్రత్తగా అడుగులు వేయాల్సి వచ్చేది. ఈ అలవాటు గురించి గతంలో నేనెప్పుడూ మాట్లాడలేదు. కానీ, నా చుట్టూ ఉన్నవాళ్లు కూడా ఈ సమస్యతో బాధపడటం చూసిన తర్వాత, ఇది మానసిక ఆరోగ్య సమస్య అని అర్థమైంది. ఈ వ్యసనం వల్ల జీవితంలో ఎన్నో కోల్పోతామనీ, ఎంతో నష్టపోతామని తెలిసిన తర్వాత.. ఏం చేయాలనే దానిపై అవగాహన వచ్చింది" అంటూ చెప్పుకొచ్చింది. ఇక సినిమాల విషయానికి వస్తే.. దేవర చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైంది జాన్వీ. ప్రస్తుతం రామ్ చరణ్ సరసన పెద్దిలో నటిస్తున్నది. ఈ సినిమా త్వరలోనే విడుదల కానున్నది.



## హారర్ థ్రిల్లర్ '418'

ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీమేకర్స్, అగ్ర దర్శకుడు ప్రశాంత్‌నీల్ భాగస్వామ్యంలో తెరకెక్కుతున్న తాజా చిత్రానికి '418' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. కీర్తన్ నాదగౌడ దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రశాంత్‌నీల్ సమర్పకుడు. సూర్యరాజ్, హనురెడ్డి, ప్రీతి పగడాల ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. ఓ గ్రామంలోని మెడికల్ కాలేజ్ నేపథ్యంలో జరిగే కథ ఇదని, సైన్స్, మూఢనమ్మకాల మధ్య అర్థంకాని ఓ రహస్యాన్ని ఛేదించే క్రమంలో ఆద్యంతం ఉత్కంఠభరితంగా ఉంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: వెంకీ జీ, సంభాషణలు: మోహన్ బి ఎస్, దర్శకత్వం: కీర్తన్ నాదగౌడ.



## ఒకవేళ అనుష్క అలా చేస్తే.. నిజంగా షాకింగే

హీరోయిన్ అనుష్క శెట్టి బయట కనిపించి చాలా ఏళ్లు గడిచిపోయింది. 'బాహుబలి' తర్వాత పాన్ ఇండియా క్రేజ్ వచ్చినప్పటికీ ఆచితూచి సినిమాలూ చేస్తూ వస్తోంది. అయితే 'సైజ్ జీరో' చేసిన తర్వాత ఈమెకు బరువు సమస్యలు రావడంతో మూవీస్ అయితే చేస్తోంది గానీ ప్రచారానికి మాత్రం నో చెబుతూనే వస్తోంది. గతేడాది 'ఘాటీ' చిత్రం చేసింది. దీని ప్రమోషన్‌లోనైనా కనిపిస్తుందేమోనని అంతా అనుకున్నారు. కానీ అలాంటిదేం జరగలేదు. అలాంటిది ఇప్పుడు చిత్రమైన రూమర్ వినిపిస్తోంది. అనుష్క ఇప్పటివరకు తెలుగు, తమిళంలో మాత్రమే సినిమాలు చేసింది. తొలిసారి మలయాళంలో 'కథనార్' అనే మూవీలో నటించింది. రీసెంట్‌గానే తెలుగు వెర్షన్ ట్రైలర్ కూడా రిలీజ్ చేశారు. ఇందులో స్వీటీని ఒకటి రెండు షాట్స్‌కే పరిమితం చేయడంతో ఆమె ఫ్యాన్స్ కాస్త డిసప్పాయింట్ అయ్యారు. అయితే ఎప్పుడూ లేని విధంగా ఈ చిత్ర ప్రచారానికి అనుష్క.. ఏకంగా హైదరాబాద్ వస్తుందని టాక్ వినిపిస్తోంది. కానీ ఆడియెన్స్ మాత్రం నమ్మట్లేదు. ఎందుకంటే తెలుగులో నేరుగా సినిమాలు చేసినప్పుడే వాటిని ప్రమోట్ చేసేందుకు బయటకు రాలేదు. అలాంటిది ఓ మలయాళ డబ్బింగ్ చిత్రం కోసం హైదరాబాద్ వస్తుందా? సందేహమే అని మాట్లాడుకుంటున్నారు. ఈ ఏడాది ద్వితియార్థంలోనే మూవీ థియేటర్లలోకి వస్తుందని అధికారికంగా ప్రకటించారు. కానీ ఏ నెల అనేది మాత్రం క్లారిటీ ఇవ్వలేదు. 9వ శతాబ్దానికి చెందిన కథనార్ అనే క్రైస్తవ మతప్రచారకుడి జీవితం ఆధారంగా దీన్ని తెరకెక్కిస్తున్నారు.



## కష్టకాలంలో తన కుటుంబం అండగా నిలిచిందన్న హన్సిక

తెలుగు, తమిళ చిత్రాలతో 'యాపిల్ బ్యూటీ'గా పేరు తెచ్చుకున్న హన్సిక, తన విడాకుల వార్తలపై ఎట్టకేలకు మౌనం వీడారు. భర్త సోహెల్ కతురియాతో నాలుగేళ్ల బంధానికి స్వస్తి పలుకుతూ ముంబై కోర్టులో విడాకులు తీసుకున్నట్లు వస్తున్న వార్తలపై ఆమె తనదైన శైలిలో స్పందించారు. "మనం తప్పు ట్రైన్ ఎక్కామని తెలిసినప్పుడు, వీలైనంత త్వరగా దిగిపోవడమే మంచిది" అంటూ వైవాహిక బంధం ముగియడంపై ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. తన నిర్ణయం పట్ల తనకు ఎలాంటి పశ్చాత్తాపం లేదని ఆమె స్పష్టం చేశారు. జనాలకు హెడ్ లైన్స్, క్లిక్ బైట్స్ కావాలి కానీ, తనకు వ్యక్తిగత ప్రశాంతత అంతకంటే ముఖ్యమని హన్సిక పేర్కొన్నారు. విడాకుల తర్వాత మానసిక ప్రశాంతత కోసం జపాన్ వెళ్లి వచ్చానని, ఈ కష్టకాలంలో తన కుటుంబం అండగా నిలిచిందని తెలిపారు. 2022లో అట్టహాసంగా జరిగిన ఈ వివాహం, ఓటీటీలో డాక్యుమెంటరీగా కూడా విడుదలైంది. అప్పట్లో హన్సిక తన స్నేహితురాలి మాజీ భర్త అయిన సోహెల్ ను పెళ్లాడడం చర్చనీయాంశం అయింది. ఇప్పుడు వీరిద్దరి బంధం కూడా ముగియడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఏదేమైనా, తన శ్రేయస్సుకే ప్రాధాన్యతనిస్తూ హన్సిక తీసుకున్న ఈ నిర్ణయంపై నెటిజన్ల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com